వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
గురువారం 23 ఫిబ్రవరి 2023

## దస్తగిరిని అభినందించిన ఎస్పీ అన్బురాజన్



కడప క్రైం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:

జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న ఎస్.కె.దస్తగిరి(హెచ్‌జీ-432) టెన్నీస్‌లో మరిన్ని విజయాలు సాధించాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆకాంక్షించారు. కడప నగరంలో ఈనెల 15 నుంచి 21 వరకు నిర్వహించిన ఆల్ ఇండియా సీనియర్ టెన్నీస్ పోటీల్లో 35 ప్లస్‌డబుల్స్ విభాగంలో తన పార్టనర్ అరుణ్ కుమార్‌రెడ్డితో కలిసి ఛాంపియన్‌షిప్ గెలుపొంది విజయ బావుటా ఎగరేశాడు. ఈ నేపథ్యంలో బుధవారం స్థానిక పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ దస్తగిరిని ప్రత్యేకంగా అభినందించారు. అకుంఠిత దీక్ష, పట్టుదల ఉంటే ఏమైనా సాధించవచ్చని మరిన్ని విజయాలు సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు. దస్తగిరి మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అన్బురాజన్ ప్రోత్సాహంతో తాను విజయాలు సాధించగలిగానని ఈ సందర్భంగా ఎస్పీ అన్బురాజన్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మైదుకూరు డీఎస్పీ ఎస్.ఆర్.వంశీదర్ గౌడ్, ఆర్ఎస్సై శ్రీనివాసులు పాల్గొన్నారు.

## వజు ఖానా నిర్మాణం పనుల్లో వేగం పెంచండి

### -ఈద్గా ప్రాంగణంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి .ఫిబ్రవరి22 ప్రభాతవార్త

పవిత్రమైన రంజాన్ పండుగ ముస్లీం మైనార్టీలు నిర్వహించే ప్రార్ధనలుకు వజుఖానా నిర్మాణం పనులును త్వరితగతిన పూర్తి అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుదవారం అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని ముస్లీం మైనార్టీలు ప్రార్ధనలు నిర్వహించే ఈద్గా ప్రాంగణంలోని ఎంపి మిధున్‌రెడ్డి నిధులతో ఈద్గా కమిటి అద్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్ పర్యవేక్షణలో జరుగుతున్న వజు ఖానా నిర్మాణం పనులను బుదవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఈద్గా ప్రాంగణంలో వాకింగ్ టాక్, పచ్చదనాన్ని పెంపొందిం చేందుకు కృషి చేస్తానన్నారు. వారి వెంట మున్సిపల్ చైర్మన్ షేక్ ఫయాజ్ బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్‌లతో పాటు వైకాపా మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సక్టోరల్ అధికారులదే కీలక బాధ్యత

### ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్





రాయచోటి .ఫిబ్రవరి 22 ప్రభాతవార్త

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో సెక్టోరల్ అధికారులదే కీలక బాధ్యత అని, పోలింగ్ అధికారులకు వారంలోనే శిక్షణ ఇవ్వాలని, ఓటింగ్ ప్రక్రియపై ఓటర్లుకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని, ఉపాదా్యయులు, పట్టభద్రులు ఎమ్మెల్సీ సమీక్ష సమావేశంలో జిల్లా అధికారులను కలెక్టర్ గిరీష పిఎస్ ఆదేశించారు. 2023 మార్చి 13న జరగబోయే గ్రాడ్యుయేట్, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబందించి భారత ఎన్నికల సంఘం 2023 ఫిబ్రవరి 16న నోటిఫికేషన్ ఇచ్చిందని, జిల్లా అధికారులందరికి ఎన్నికల విధులు కేటాయించమని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని, రవాణా సౌకర్యాలను, ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బ్యాలెట్ పత్రాలు మరియు బ్యాలెట్ బాక్సులను మంచి స్థితిలో ఉండేలా చూడాలని ఆయా బాధ్యతను కేటాయించిన నోడల్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. రాజకీయ పార్టీలు మరియు ఇతరులు నుంచి వచ్చిన పిర్యాదలుకు సంబందించి తీసుకున్న చర్యలును పిర్యాదు రిజిష్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలె క్టర్ తమీమ్ అన్సా రియా, డిఆర్వో సత్యనారాయణ, మదనపల్లి, రాయచోటి ఆర్డివోలు మురళీ, రంగస్వామి, నోడల్ అధికారులు, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

# ఒక్క పార్కుకు నోచని బద్వేలు మున్సిపాలిటీ



బద్వేలు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :

- 14 ఏళ్లు పూర్తయినా అభివృద్ధి శూన్యం
- పాలకులు మారుతున్నా అభివృద్ధి లేదు
- మున్సిపాలిటీలో స్థలాలన్నీ కబ్జా!
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

బద్వేలు మున్సిపాలిటీ ఏర్పడి 14 ఏళ్ళు పూర్తయినా ఇంత వరకూ అభివృద్ధి జరగకపోవడంతో ప్రజలు మండి పడుతున్నారు. పాలకులు మారుతున్నారే గానీ అభివృద్ధి విషయంలో మాత్రం ముందడుగు వేయలేక పోతున్నారు. మున్సిపాలిటీ ఏర్పడి ఇన్ని సంవత్సరాలు గడిచి గ్రేడ్-3 నుండి గ్రేడ్-2 కు మారినా ఒక్క పార్కు కూడా నోచుకోకపోవడం దురదృష్టకరం. రాష్ట్రంలో ఏ మున్సిపాలిటీలో చూసినా చిన్న పార్కు అయినా ఉంటుంది. కానీ బద్వేలులో మాత్రం పార్కు అనే మాటకే అర్థం లేకుండా పోయింది. చిన్న చిన్న మున్సిపాలిటీలలో కూడా సౌకర్యాలతో పాటు, ఆహ్లాదకరమైన వాతావరణంలో చిన్న పార్కు అయినా కనపడుతుంది. బద్వేలులో మాత్రం కనుచూపు మేరకు పార్కు సంబంధించిన ఆనవాళ్ళు కూడా కనపడవు. అక్కడక్కడా ప్రభుత్వ స్థలాలున్నా అవి కబ్జాకు గురవుతున్నాయి తప్ప వాటిని భద్రపరుచుకున్న దాఖలాలు లేవు. ఎన్జీవో కాలనీలో మున్సిపాలిటీ కార్యాలయం ఎదురుగా 70 సెంట్లకు పైగా ప్రభుత్వ స్థలం ఉంది. గతంలో ఆ స్థలాన్ని ఎగ్జిబిషన్‌లకు మున్సిపాలిటీ వారు అద్దెకు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ స్థలం ఖాళీగా ఉన్నా పార్కు ఏర్పాటు చేయాలనే ఆలోచన చేయకపోవడం దురదృష్టకరం. అలాగే ఖాళీ స్థలం వదిలేస్తే భవిష్యత్తులో ఖచ్చితంగా కబ్జాకు గురికావడం ఖాయం అని పలువురు ప్రజలు అంటున్నారు. సిద్దవటం రోడ్‌లోని సర్వే నెంబర్ 1794, 1795 లో ఉన్న 6 ఎకరాల 74 సెంట్లు ప్రభుత్వ భూమిలో ఆర్డీవో కార్యాలయం నిర్మించాలని నిర్ణయించినా ఇంత వరకూ ఏర్పాటు చేయలేదు. కానీ ఈ స్థలంలో పార్కు ఏర్పాటు చేయాలని పలువురు కోరారు. అలాగే పోరుమామిళ్ళ బైపాస్ రోడ్‌లో ఉన్న పాత డంపింగ్ యార్డులో చిన్న చిన్న గృహాలు ఏర్పడ్డాయి. కుంట స్థలాల్లో నిర్మాణాలు చేయకూడదని తెలిసినా కొంత మంది పేదలు ఎకరాల స్థలంలో గుడిసెలు వేశారు. అక్కడ కూడా పార్కు ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలం. అలాగే నెల్లూరు రోడ్‌లోని అయ్యప్ప స్వామి గుడి వద్ద ఉన్న నాగుల చెరువు పరిసర ప్రాంతాలలో పార్కు ఏర్పాటు చేయాలని గతంలో అధికారులు నిర్ణయించారు. కానీ ఆ ఊసే లేకుండా పోయింది. నాగుల చెరువును అభివృద్ధి చేసి చుట్టూ ట్యాంక్‌బండ్‌గా ఏర్పాటుచేసి పార్కు ఏర్పాటు చేస్తామని ప్రజా ప్రతినిధులు ప్రజలకు హామీ ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. ఇలా అనేక రకాలుగా బద్వేలు ప్రజలను ప్రజా ప్రతినిధులు మోసం చేశారే తప్ప, ఒక్క పార్కు కూడా ఏర్పాటు చేసిన దాఖలాలు లేవని మండి పడుతున్నారు. త్వరలో గ్రేడ్-2గా ఉన్న బద్వేలు మున్సిపాలిటీ గ్రేడ్-1 గా మారే అవకాశాలు కూడా దగ్గర్లో ఉన్నా ఇంత వరకూ మున్సిపాలిటీకి తగ్గ వసతులు లేకపోవడం దురదృష్టకరం అని మండి పడుతున్నారు ప్రజలు. పన్నులు మాత్రం ముక్కు పిండి వసూలు చేస్తున్నారే గానీ అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో వెనుకడుగు వేస్తున్నారు. అన్ని వసతులు ముంగిట్లో ఉన్నప్పటికీ సమకూర్చడంలో ఇటు ప్రజా ప్రతినిధులు, అటు అధికారులు విఫలం కావడంపై ప్రజలు మండి పడుతున్నారు.

# రూ. కోట్ల విలువైన కాలువ భూములు ఆక్రమణ

- ప్రేక్షకపాత్ర పోషిస్తున్న ఇరిగేషన్ అధికారులు
- పట్టీ పట్టనట్లు రెవెన్యూ అధికారులు
- ఇష్టారాజ్యంగా పంట కాలువల స్థలం రిజిస్ట్రేషన్



రాజంపేట అర్బన్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త





పంట కాలువలు మూసివేస్తున్నారు. డ్రైనేజి కాలువలు ఆక్రమిస్తున్నారు. వాటినుంచి నీరు వెళ్లేందుకు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోరు.. అసలు కాలువలు ఉన్నాయో లేదో కూడా తెలియదని అంటున్నారు. ఇది ఒక ఎత్తు అయితే కొందరు రెవెన్యూ అధికారులు ముడుపులకు లోబడి జారీ చేస్తున్న సర్టిఫికెట్లు అక్రమార్కులకు వరంగా మారాయి. చివరకు కాలువలు పూడ్చి రియల్ ఎస్టేట్‌లో ప్లాట్లు వేసి రోడ్లు వేస్తున్నారు. రాజంపేట పట్టణంలో జాతీయ రహదారి పక్కనే వెలుగు చూసిన కాలువల ఆక్రమణకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. రాజంపేట పట్టణంలో సర్వేనంబరు 1058/2లో 10 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో కాలువ వెళుతోంది. రెవెనూ్య అడంగల్‌ను పరిశీలిస్తే ఇదే విషయం స్పష్టమవుతోంది. అయితే కాలువ కనిపించకపోవడం విశేషం. రాజంపేట పట్టణం బైపాస్‌రోడ్డుకు పక్కనే ఉన్న కళాంజలి కళ్యాణమండపానికి సమీపంలో కాలువ వెళుతోంది. కొన్నేళ్ల క్రితమే ఈ కాలువను పూడ్చివేశారు. ఇంతలోపు కడప - రేణిగుంట రహదారి నిర్మాణంలో ఈ కాలువకు కనీసం కల్వర్టు కూడా నిర్మించకుండా నాడు ఆర్ అండ్ బి అధికారులు నిర్లక్ష్యం చేశారు. దీంతో జాతీయరహదారి నిర్మాణం పుణ్యమా అని జాతీయ రహదారి నుంచి చక్రాలమడుగు వరకు వెళ్లే ఈ కాలువను సుమారు 300 మీటర్లు పైబడి పూడ్చివేశారు. వాటిపై నిర్మాణాలు చేపట్టారు. ప్లాట్లు వేశారు. కాలువను పూడ్చి వెంచర్‌లో రహదారి నిర్మించారు. దానికంటే ముందు ఓ భవనాన్ని కూడా నిర్మిస్తున్నారు. కాలువను పూడ్చిన విషయం అప్పుడే బయట పడింది. రెవెన్యూ అధికారులు మాత్రం కాలువ ఉందని నిర్ధారించినట్లు తెలుస్తోంది. అయితే అంతకుముందు ఈ సర్వేనంబరులో వెళుతున్న కాలువలో ప్లాట్లు వేసి ఉన్నారు. ఆ సమయంలో ఓ సర్వేయర్ కాలువ ఆక్రమణకు సహకరించినట్లు తెలుస్తోంది. అంతేగాకుండా ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని, కాలువ పరిసర ప్రాంత స్థల యజమానులు చెబుతున్నారు. ఇకనైనా కాలువను పునరుద్ధరించి ఆక్రమణలు తొలగించేందుకు అటు రెవెన్యూ, ఇటు ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. జాతీయ రహదారి పక్కనే రాజంపేట బైపాస్‌రోడ్డులో సెంటు స్థలం 20 లక్షల నుంచి 30 లక్షలు పలుకుతోంది. అంటే ఆక్రమణకు గురైన కాలువ స్థలం విలువ 2 నుంచి 3 కోట్ల రూపాయలు విలువ అన్నమాట. అధికారులు ఏ మేరకు చర్యలు తీసుకొంటారో వేచి చూడాల్సిందే.

# పశుసంపదను కబేళాలకు తరలిస్తున్న ముఠా

### మదనపల్లెలో దళారీ వ్యవస్థ .....పశువైద్యాధికారి దృవీకరణ లేకుండానే తరలింపు

మదనపల్లె, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :



పశుసంపదను కబేళాలకు తరలిస్తున్న ముఠా, కేరళ కబేళాలకు తరలింపు, మదనపల్లెలో దళారీ వ్యవస్థ పశువైద్యాధికారి దృవీకరణ లేకుండానే తరలింపు, లారీల్లో తరలిస్తుంటే అయ్యో మనిపిస్తొందంటూ పలువురు మూగ ప్రేమజీవులు, కబేళాలకు పశుసంపద తరలింపు పేరుతో పట్టణంలోని మార్కెట్‌యార్డులో దళారులు, వ్యాపారులు కలసికట్టుగా రాకెట్టు నిర్వమిస్తూ లక్షల రుపాయల సొమ్మును కాజేస్తున్నారు. పట్టణంలోని పశుసంపదను కేరళకు తరలించే ముఠా బహిరంగానే చీకటి వ్యాపారాన్ని నిర్వహిస్తున్నది. అయినా దీనిపై నిఘా ఉంచాల్సిన మార్కెట్‌యార్డు అధికారులు దృవీకరించాల్సిన పశువైద్యాధికారి తమకు ఈ లోగుట్టు తెలియనట్లు వ్యవహరించడం గమనార్హం. కబేళాలకు తరలించే పశువల వ్యాపారంలో లక్షల రుపాయలు చేతులు మారుతున్నట్లు సమాచారం. ఈ ముఠా సూత్రదారికి ప్రతినెల దాదాపు రూ.20లక్షల వరకు ఆదాయం వస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. దాళారీకు కూడా ఒక్కో సంతకు లక్షల రుపాయల వరకూ ముట్టచెబుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ సంతలో దాదాపు రెండువేల పశువుల క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. ఈ క్రయ విక్రయాల ముసుగులో పశువులను వధించడానికి కొనుగోలు చేసే ముఠా ఒకటి బహిరంగంగానే సంచరిస్తూ వ్యాపారాలు నిర్వహిస్తున్నది. నిబంధనల ప్రకారం ఒక పశువు వ్యావసాయానికి, పాడికి పనికిరాదని పశువైద్యాధికారి దృవీకరించాల్సిన అవసరం ఉంటుంది. అలాగే ఒక్కో పెద్ద లారీలో ఎనిమిది పశువులకు మాత్రమే తరలించాలనే నిబంధన ఉంది. కాగా ఈ కబేళా ముఠా నిబంధనలకు నీళ్ళు వదలి ఒక్కో లారీలో 20 పశువుల వరకు కుక్కుతున్నారు. ఈ మూగ జీవాలకు సరైన సదుపాయాలు కూడా లారీలలో కల్పించడం లేదనే విమర్శలు ఉన్నాయి. గాలి, వెలుతురు లేకుండా పోలీసుల కన్నుగప్పి ఈ మూగజీవాలను ఇతర రాష్ట్రాలకు తరలిస్తుండడంపై పలువరు ఆవేదన చెందుతున్నారు. అయ్యో అనిపిస్తొందని తెలిపారు. పశుసంపద తరలింపుపై ఎటువంటి పర్యవేక్షణ లేకపోవడం ఆశ్యర్యాన్ని కలిగిస్తొంది. కాగా కేరళా ముఠా యదేచ్చగా తమ రాష్ట్రాల్లోని కభేళాలకు తరలిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం చోద్యం చూస్తున్నట్లు వ్యవహరించడంపై విమర్శలు ఉన్నాయి.

**చోద్యం చూస్తున్న రక్షకభటులు :**

అనంతపురం నుంచి చెన్నైకు తరలించే జాతీయ రహదారిలో ఎన్ని పోలీస్ స్టేషన్‌లు, ఎన్ని చెక్‌పోస్టులు ఉన్నాయో వాటిని అన్నింటికి మామూలు ఇస్తూ చాటుగా ముడుపులు ఇస్తూ చేరాల్సిన చోటుకు చేరుతున్నారంటే పోలీసుల నిర్లక్ష్య వైఖరి ఎంతో అర్థమవుతోంది. మామూళ్ళు అందితే చాలూ అంటూ పోలీసులు చోద్యం చూస్తున్నారు.

# ముగిసిన గంగమ్మ జాతర

- జాతరలో ఆకర్షణగా నిలిచిన కుంకుమబండి
- మైలు తిరుణాల రోజు కూడా తగ్గని జనం
- వందల సంఖ్యలో బెల్లపు చెరుకు లారీలు
- భక్తులను అలరించిన రేలారే రేలా,చెక్కభజనలు







లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త: మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ తల్లి గంగ జాతర రెండో రోజు బుధవారం ఆదిమూలం చిన్నప్ప వంశీయులు వచ్చిన భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. జాతర అంగరంగ వైభవంగా జరిగింది. ఈ జాతరకు రాయలసీమ నుంచే కాకుండా తెలంగాణ, బెంగళూరు, చెన్నై ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు లక్షల సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. రెండు రోజుల పాటు ప్రత్యేక క్యూ లైన్లు భక్తులతో కిక్కిరిశాయి. జాతర ప్రాంగణమంతా శాంభవి శక్తి స్వరూపిని అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. గంగమ్మ జాతరలోని బెల్లం చెరుకులు ఇనప సామాను బాగా వ్యాపారాలు జరిగాయి. రాత్రి వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతో ఆకట్టుకున్నాయి. జబర్దస్త్ టీం రేలా రేలారే గోపాల టీం లక్ష్మీ డ్యాన్స్ ప్రోగ్రాంచే రాత్రి 9 గంటల నుంచి ఉదయం 4 గంటల వరకు వినోదాలు జరిగాయి. కొత్తవాండ్లపల్లెకు చెందిన వెంకటరామిరెడ్డి వంశీయులు కుంకుమ బండిని జాతర కు అత్యంత వైభవంగా తీసుకువచ్చారు. ప్రతి ఏడాది గంగమ్మ జాతరకు కుంకుమ బండి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ ఏడాది కూడా ఆలయ సాంప్రదాయాల ప్రకారం కుంకుమ బండికి అర్చకులు పూజలు నిర్వహించారు. జాతరకు డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో లక్కిరెడ్డి పోలీసులు సీఐ వరప్రసాద్, ఎస్సై వినోద్‌కుమార్‌రెడ్డి బందోబస్తు నిర్వహించి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### అమ్మవారిని దర్శించుకున్న రమేష్‌కుమార్‌రెడ్డి

ద్వారక గంగమ్మ తల్లిని రాయచోటి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లె మాజీ శాసనసభ్యుడు గడికోట ద్వారకనాథ్‌రెడ్డిలు బుధవారం అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను దేవస్థానం చైర్మన్ నరసింహారెడ్డి సన్మానించారు.







# ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగలు అరెస్ట్

### విలేకరుల సమావేశంలో ఎస్పీ అన్బురాజన్

- రూ.4లక్షలు విలువైన బంగారు నగలు, రూ.20వేలు స్వాధీనం
- ఏపీ, తెలంగాణ రాష్ట్రాలలో వీరిపై 73 కేసులు
- దొంగల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి





కడప క్రైం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:

ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న గుంటూరు జిల్లా శారదాకాలనీకి చెందిన చిలర్ల సురేష్, అగ్రహారానికి చెందిన ఫైర్దా కిరణ్ అనే ఇరువురు కరుడుగట్టిన అంతర్రాష్ట్ర దొంగలను మైదుకూరు రూరల్ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.4 లక్షలు విలువైన బంగారు నగలు, రూ.20వేలు నగదు స్వాధీనం చేసు కున్నట్లు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. స్థానిక పోలీసు కార్యాలయ ఆవరణలోని పెన్నార్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ఈ వివరాలు వెల్లడించారు. తన ఆదేశాల మేరకు మైదుకూరు డీఎస్పీ వంశీధర్ గౌడ్ ఆధ్వర్యంలో మైదుకూరు రూరల్ సీఐ నరేంద్రరెడ్డికి రాబడిన సమాచారం మేరకు బి.మఠం ఎస్సై విద్యాసాగర్, వారి సిబ్బంది మంగళవారం సాయంత్రం బి.మఠం మండల పరిధిలోని నందిపల్లె క్రాస్ వద్ద ఇద్దరు అనుమానంతో వెళ్తుండడంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా 2019-20, 23 సంవత్సరాల్లో బి.మఠం మండలంలోని గంగిరెడ్డిపల్లె, నరసన్నపల్లె, లింగాలపల్లె దిన్నెలో దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందన్నారు. వీరు దొంగలించిన వస్తువులను అటికా గోల్డ్, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీల్లో తాకట్టు పెట్టినట్లు విచారణలో నిందితులు వెలిపినట్లు ఎస్పీ వివరిం చారు. వారిచ్చిన సమాచారం మేరకు ఈ బంగారు వస్తువులను సంబంధిత ఫైనాన్స్ కంపెనీల నుంచి స్వాధీనం చేసుకున్నామన్నారు. ముద్దాయిలు గుంటూరు లో ఇళ్లలో టైల్స్ పరిచే పని చేస్తూ ఆంధ్ర, తెలంగాణాల్లో ఇలాంటి దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారన్నారు. వీరిపై రెండు రాష్ట్రాల్లో 273 కేసులు నమోదు చేశారని, కొన్ని కేసుల్లో శిక్షలు అనుభవించి బయటకు వచ్చిన తరువాత కూడా ఇలాంటి నేరాలు చేస్తున్నారన్నారు. వీరిపై రెండు రాష్ట్రాల్లోని పలు కేసుల విషయంలో కోర్టులో విచారణ జరుగుతోందన్నారు. వీరిని అరెస్టు చేయడంలో విశేష ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులను అభినందించినట్లు ఎస్పీ తెలిపారు.

ముఖ గుర్తింపు ఆధారిత హాజరు వందశాతం అమలవ్వాలి : కలెక్టర్ IIలో

మానవత్వం చాటుకున్న సిఐ మంజునాథరెడ్డి IIలో

# ముఖ గుర్తింపు ఆధారిత హాజరు వందశాతం అమలవ్వాలి

– కలెక్టర్ గిరీషా పిఎస్



రాయచోటి .ఫిబ్రవరి22 ప్రభాతవార్త

జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ గుర్తింపు ఆధారిత హాజరు నూరు శాతం అమలయ్యేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ సంబందిత అధికారులను ఆదేశించారు. బుదవారం తాడేపల్లి నుంచి కార్యదర్శి ముత్యాలరాజు సిఎస్ ఎం ఎస్ అధికారి సునీల్‌రెడ్డితో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్‌లతో ముఖ గుర్తింపు ఆధారిత హాజరు అమలుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ గిరిష పిఎస్, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, డిఆర్వో సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గిరిష పిఎస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఉద్యోగికి ముఖ గుర్తింపు ఆధారిత హాజరు తప్పనిసరి చేసిందని ఉద్యోగులందరూ ఎపిఎఫ్ఆర్ఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని తప్పకుండా ముఖాధారిత హాజరు ఉదయం, సాయంత్రం తప్పక వేయాలన్నారు. క్యాంప్ వెళ్లిన అధికారులు, ఆన్ డ్యూటీలో ఇతర ప్రాంతంలో ఉన్న అధికారులు యాప్‌లో ఉన్న నిబంధనలు మేరకు హాజరు వేయాలన్నారు. ఇందులో ఎటువంటి సాంకేతి సమస్యలు, సందేహాలు ఉన్నా వెంటనే ఎన్ఐసి వారిని సంప్రదించి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా సిబ్బంది ముఖ గుర్తింపు ఆధారిత హాజరును సంబందిత డిడిఓలు పర్యవేక్షించాలన్నారు.

# ఉపాధి పనులు, రికార్డుల నిర్వహణ భేష్

## డ్వామా అడిషనల్ పిడి శివప్రసాద్

రాజుపాళెం, ఫిబ్రవరి22, ప్రభాతవార్త.



ఉపాధిహామి పనులు, రికార్డులు, జిజిఐ ప్యారామీటర్ల నిర్వహించటంలో జిల్లాలో రాజుపాళెం మండలం శభాష్ అని డ్వామా అడిషనల్ పిడి శివప్రసాద్ అన్నారు. ఉపాధిహామి పథకం నిర్వహణ, అదనపు నిర్వహణ అధికారుల పని తీరును ప్రశంసించారు. మండలంలో 2021-22 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధిహామి పనులు, పంచాయతీ రాజ్, సర్వశిక్షణాఅభియాన్ పనులు సంబంధించి చేపట్టిన పనులు, రికార్డులు, వేతనాల చెల్లింపులు అంశాలపైన మండల పరిధిలోని 15 గ్రామపంచాయతీలలో 16 విడత సామాజిక తనిఖీ యస్ఆర్పి తిరుమ లేసు బృందం చేపట్టిన సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం బుదవారం మండల పరిషత్ కార్యాల యంలో యంపిడిఓ సయ్యద్‌హుస్నీసా ఆధ్యక్షతన జరిగినది. ఈ కార్య క్రమం నకు ముఖ్యఅథిధిగా హాజరైన డ్వామా అడిషనల్ పిడి శివప్రసాద్ మాట్లాడుతూ ఉపాధిహామి పథకం నిర్వహణ అధికారులు, సిబంది, పిఆర్, గృహనిర్మాణ, సచివాలయ అధికారుల పనితీరు శభాష్ అని ప్రశంసించారు. కార్యక్రమంలో డివిఓ యోగాంజ నేయరెడ్డి,ఏపిడి ఖాధర్‌భాష, అంబున్‌మెన్ సాంబశివారెడ్డి, క్వాలిటి కంట్రోల్ జెఇ సుధాకర్,ఏపిఓ గంగయ్య,ఏఇలు శివనారాయణ, శేఖర్, సామాజిక తనిఖీ డిఆర్‌పిలు, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయం, ఉపాధి హామి అధికారులు, సిబంది పాల్గోన్నారు.

# యాదాళ్ళ సుబ్బలక్షుమ్మకు నివాళులు

బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :



మంచితనానికి మారుపేరుగా నిలిచి పలువురిలో మంచి ప్రేమ, అప్యాయత, అనురాగాలు కలిగిన యాదాళ్ళ సుబ్బ లక్షుమ్మ మృతి చాలా బాధాకరం అని ఆర్యవైశ్య మహాసభ ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సెల్ అధ్యక్షులు పి.వి.ఎన్.ప్రసాద్, తెల్లనాగుల ప్రసాద్, నాగశ్రీ మెడికల్ స్టోర్ యజమాని తిరునామల కిషోర్ బాబు, శ్రీకాకుళం వెంకటసుబ్బయ్య, చిన్ని నరసింహ, కొంజేటి వెంకట సుబ్బా రావు, సముద్రాల వెంకటేశ్వర్లు, రిటైర్డ్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఎస్.వెంకట సుబ్బయ్య, రిటైర్డ్ అసిస్టెంట్ బ్యాంక్ మేనేజర్ వాసు, చెక్కా సురేష్ బాబుతో పాటు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు అన్నారు. బుధవారం రాఘవేంద్ర గ్రాండ్ మండపం యజమాని యాదాళ్ళ జయసింహ రాజు, డా॥ విజయసింహ రాజు గారి తల్లి యాదాళ్ళ సుబ్బలక్షుమ్మ ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని సిద్దవటం రోడ్‌లోని యాదాళ్ళ హార్డ్‌వేర్స్ నందు నిర్వహించారు. పలువురు ఆర్యవైశ్య నాయకులు, ప్రముఖులు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలు వేసి నివాళు లర్పించారు కార్యక్రమంలో తెల్లనాగుల మణి కుమార్, తెల్లనాగుల కాత్యాయణి, స్రవంతి, మదళ్ళపల్లె శశిధర్ కుమార్ వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# బిసి సంఘం నూతన కార్యవర్గం ఎంపిక

గాలివీడు .ఫిబ్రవరి22 ప్రభాతవార్త



బీసీల అభు ్యన్నతే లక్ష్యమని అన్నమయ్య జిల్లా బిసి సంఘం అధ్యక్షులు సి.మల్లికార్జున, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.రామాంజులు పేర్కొ న్నారు. గాలివీడు మండల కేంద్రంలోని స్థానిక ఎస్‌కె ఫంక్షన్ హాల్‌లో జిల్లా నూతన కార్యవర్గ ఎంపిక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా అన్నమయ్య జిల్లా సంయుక్త కార్యదర్శిగా బుక్కపట్నం విష్ణువర్ధన్, జిల్లా కార్యదర్శిగా నవాజ్ అలీ, జిల్లా ప్రచార కమిటి అధ్యక్షుడిగా షేక్ షమీరుల్లా ను ఏకగ్రీవంగా ఎన్ను కున్నట్లు తెలిపారు. రాజంపేట నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా పులుగురు అశోక్ కుమార్, గాలివీడు మండల బీసి సంఘం అధ్యక్షులుగా బి.వినోద్‌కుమార్, ప్రధానకార్యదర్శిగా చిన్నకొట్ల సురేష్, కార్యదర్శిగా లక్ష్మయ్యను ఎన్నుకున్నా మన్నారు. ఎంపికైన వారందరికి మైనార్టీ యువ నాయకులు షేక్ నిజాముద్దీన్ చేతులు మీదుగా నియామక పత్రాలును అందజేశారు. కార్యక్రమంలో రాయచోటి నియోజకవర్గ అధ్యక్షులు అమీర్ బాష, మండల బిసి నాయకులు మడితంరెడ్డి కుమార్, ఆవులకుంట శ్రీకాంత్, పందు కిషోర్, జావీద్‌భాయ్, వినోద్ దేవశేకర్, చిన్నకొట్ల వెంకట్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి అభినందనలు

కడప ఏడురోడ్లు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:



స్థానిక శిల్పారామంలో స్థానిక సంస్థల నుంచి ఉమ్మడి జిల్లా నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా రామసుబ్బారెడ్డిని ప్రభుత్వం ప్రకటించడంతో నిర్వహించిన అభినందన సభలో 33, 34 డివిజన్ల కార్పొరేటర్లు గౌస్‌బాషా(చాక్లెట్), అలీ అక్బర్‌లు కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# శభాష్ బసవరాజు అంటున్న డివిజన్ ప్రజలు

కడప ఏడురోడ్లు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:



నగర పరిధిలోని 37వ డివిజన్‌లోని అగాడి, వక్కలపేట, సాయిపేట ప్రాంతాల్లో ఏళ్ల తరబడి రోడ్ల నిర్మాణానికి నోచుకోక ప్రజలు ఇబ్బంది పడేవారు. అలాగే మురుగు కాలువలు సమస్యల పట్ల గతంలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. ఈ సమస్యలు తెలుసుకున్న కార్పొరేటర్ సమ్మెట బసవరాజు డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, మేయర్ సురేష్‌బాబుల దృష్టికి తీసుకెళ్లి వారి సహకారంతో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. ఇది చూసి ప్రజలు తమ సమస్యను పరిష్కరించడంతో పాటు స్వయంగా పనులను పర్యవేక్షిస్తున్నందుకు శభాష్ బసవరాజు అని ప్రజలు కొనియాడుతున్నారు.

# యువగళం పాదయాత్రకు తరలివెళ్లిన నేతలు

కమలాపురం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:



కమలాపురం నియోజకవర్గం నుంచి బుధవారం ఉదయం పుత్తా చైతన్యరెడ్డి, పుత్తా లక్ష్మిరెడ్డి, పుత్తా ఎల్లారెడ్డి, ఐటీడీపీ అబ్దుల్ నబీ, ఎర్రబల్లి సుబ్బారెడ్డి, ఐటీడీపీ నరసింహులతో పాటు ఆరు మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు భారీగా వాహనాలలో 250 మంది తరలి వెళ్లారు. శ్రీకాళహస్తి దగ్గర ముడిబాక గ్రామం వద్ద కొనసాగుతున్న నారా లోకేష్ యువ గళం పాదయాత్రలో కలిసి తమ సంఘీభావం తెలిపి ఆయనతో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారా లోకేష్ ప్రతి ఒక్కరిని పేరు పేరునా ఆత్మీయంగా పలకరించి సాదరంగా పాదయాత్రలోకి ఆహ్వానించారు. ఈ క్రమంలో నియోజకవర్గ పరిస్థితులపై చైతన్యరెడ్డి, పుత్తా లక్ష్మిరెడ్డిలను ఆరా తీశారు. ఆయనకు ప్రస్తుత పరిణామాల గురించి చైతన్యరెడ్డి, లక్ష్మిరెడ్డిలు క్షుణ్ణంగా వివరించగా నియోజకవర్గ ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని ప్రభుత్వ వైఫల్యాలపై ఇంటింటికీ వెళ్లి వివరించాలని తెదేపా కార్యకర్తలను సన్నద్ధం చేయాలని దిశానిర్దేశం చేశారు.

# ఉపాధిలో కూలీల సంఖ్యను పెంచాలి

దువ్వూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:



మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని చేసే కూలీల సంఖ్యను పెంచాలని ఏపీవో రామచంద్రా రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పనులు ముగిసినందున పని చేసే ప్రతి కూలీకి ఉపాధి హామీలో పని కల్పించాలన్నారు. గతంలో మాదిరి కాకుండా ఉపాధి హామీ పనులు చేసే కూలీలకు రెండు సార్లు ఫొటోలు తీసి వాటిని యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఉదయం 7 గంటలకు, 11 గంటలకు ఫొటోలు తీయాలన్నారు. మస్టర్లలో ఎటువంటి కొట్టివేతలు ఉండరా దన్నారు. ఉపాధి హామీ జాబ్ కార్డులకు బ్యాంక్ ఖాతాకు ఆధార్ అనుసంధానం చేయాలని అప్పుడే అన్ని ఒకే చోట ఉండడంతో వారి డబ్బులు ఖాతాలో జమ అవుతా యన్నారు. సమీక్షలో ఈసీ విజయ్‌కుమార్, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

# మతి స్థిమితం లేని వ్యక్తి మృతి

దువ్వూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన దువ్వూరు సమీపంలో జాతీయ రహదారి పక్కన మతి స్థిమితం లేని వ్యక్తి బుధవారం పడి ఉండగా అతన్ని గుర్తించి ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించగా అతను మరణించి నట్లు ఎస్సై రాఘవేంద్రరెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రొద్దుటూరుకు చెందిన బి.కవిసాయిరాం (42) అనే వ్యక్తి మతిస్తిమితం లేకుండా తిరుగుండే వాడు. ఇతను 2, 3 రోజులైనా ఇంటికి రాదని అతని బంధువులు తెలిపారు ఇందులో భాగంగా 2 రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయి దువ్వూరు సమీ పంలో జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తూ రాళ్లపై పడిపోవడంతో స్థాని కులు గుర్తించారు. వెంటనే 108 వాహనంలో ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. సాయిరాం బంధువైన మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# రాయల్ రషీద్ కుటుంబాన్ని పరామర్శించిన తులసిరెడ్డి

కడప వైద్యవిభాగం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:

కడప నగరంలో గత 40 సంవత్సరాలుగా రాయల్ ఫొటో స్టూడియో నిర్వహిస్తూ అనేక ప్రభుత్వ కార్యకలాపాలను, ప్రైవేటు కార్యకలాపాలను ఎప్పటి కప్పుడు చిత్రీకరిస్తూ, తలలో నాలుకలా కడప ప్రజల, అధికారుల, రాజకీయ నాయకుల, కళాకారుల ప్రశంసలు అందుకున్న రాయల్ రషీద్ అకాల మరణం కళా రంగానికి తీరని లోటని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా ఛైర్మన్ డా.నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. కడప నగరంలోని రెండవ గాంధీ విగ్రహం వద్ద గల రాయల్ రషీద్ కుటుంబ సభ్యులను కరీముల్లా, షబ్బీర్, రషీద్ ధర్మపత్రిని వారి పిల్లలను బుధవారం తులసిరెడ్డి కలిసి పరామర్శించారు. రషీద్ ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ తరుపున ఎల్లవేళలా సహాయంగా ఉంటామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర మీడియా ఛైర్మన్ డా.నర్రెడ్డి తులసిరెడ్డితో పాటు కాంగ్రెస్ కడప జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌గౌడ్, రామకృష్ణ, అమర్, ఉత్తన్న, శివ, సత్యం పాల్గొన్నారు.

# స్టాఫ్‌నర్స్ మాధవికి సన్మానం

కాశినాయన, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :



మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న స్టాఫ్‌నర్స్ మాధవి కలసపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ కావడంతో నరసాపురం ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డా॥ ప్రశాంతి ఆధ్వర్యంలో వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాలతో ఘనంగా సన్మానించి వారికి బహుమతిని అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి, కలసపాడు మండల ఆరోగ్య విస్తరణ అధికారి ఖాదర్ బాష, మండల ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసులు రెడ్డి, సుబ్బరాయుడు, పబ్లిక్ హెల్త్‌నర్స్ శారద, అఫ్తాల్మిక్ అధికారి కృష్ణదేవ రాయులు, ఆరోగ్య పర్యవేక్షకులు బాలయ్య, నాగమణి, ఫార్మాశిస్టు సుబ్బ రాయుడు, సీనియర్ అసిస్టెంట్ సుదర్శన్ రెడ్డి, నర్సులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొని వారిని ఘనంగా సన్మానించారు.

# గర్భవతులు పౌష్ఠికాహారం తీసుకోవాలి

బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :



గర్భవతులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా పౌష్ఠికాహారం తీసుకోవడం వలన తల్లి బిడ్డ క్షేమంగా ఉంటారని తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డా॥ వినయ్ కుమార్ అన్నారు. బుధ వారం తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తిరువెంగళాపురం సచివాలయంలో డా॥ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించి, అనంతరం వారు మాట్లాడుతూ దీర్ఘకాలిక స్వల్పకాలిక వ్యాధిగ్రస్తులకు, గర్భవతులకు, బాలింతలకు అవసరమైన పరీక్షలు చేసి, మందు లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. గర్భవతులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేయించుకుంటూ పౌష్ఠికాహారం తీసుకోవాలని, అప్పుడే తల్లీ బిడ్డ ఆరో గ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, సిహెచ్‌వో హర్షిత, ఆరోగ్య సిబ్బంది జనార్ధన్, ఆశా కార్యకర్త, 104 సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపవాస దీక్షలతో దేవుని దీవెనలు పొందండి

ముద్దనూరు ఫిబ్రవరి 22, ప్రభాతవార్త

ఉపవాస దీక్షలతో, దేవుని దీవెనలను పొందాలని, ఇక్కడి ఆర్సీఎం చర్చి ఫాదర్ మర్రెడ్డి పేర్కొన్నారు. ఆర్ సి ఎం చర్చిలలో బుధవారం నుండి తపస్సు కాల ప్రార్థనలు మొదలయ్యాయని, ఈ తపస్సు కాలంలోనే, ఆర్.సి.యం చర్చి విశ్వాసులు, ఉపవాస దీక్షలను ఆచరించి, దేవుని అనుగ్రహం పొందాలని పేర్కొన్నారు. తపో దీక్ష లతో, దానధర్మాలు చేస్తూ,దేవుని యందు భక్తిగా జీవిస్తూ, ఆయన కృపకు పాత్రులు అవ్వాలని వివరించారు. బుధవారం ఇక్కడి ఆర్సీఎం చర్చి విశ్వాసులు విభూదిని ధరించి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలను చేశారు. అలాగే దివ్యబలి పూజా కార్యక్రమం, దివ్య సత్ప్రసాద కార్యక్రమాలు, భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ కార్యక్రమంలో ముద్దనూరు సిస్టర్లు,మంగపట్నం సిస్టర్లు, ఉపదేశి ప్రభాకర్, తో పాటు ముద్దనూరు మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఆర్సీఎం చర్చి విశ్వాసులు ఇక్కడికి విచ్చేసి ప్రార్థన కార్యక్రమాలలో పాల్గొన్నారు.

# ప్రొద్దుటూరులో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి

ప్రొద్దుటూరు ఫిబ్రవరి 22, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని ప్రకాష్ నగర్ లో టీడీపీ ఇంచార్జి జివి ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఉక్కు ఫ్యాక్టరీకి రెండుసార్లు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి ఎక్కడా చూడలేదని విమర్శించారు. కేవలం రాష్ట్ర యువతను మరోసారి మోసం చేయడానికి జగన్ కుట్రపడ్డారన్నారు. మూడు న్నరేళ్లుగా రాష్ట్రంలో ఎవరూ సంతోషంగా లేరన్నారు. ఇలాంటి పరిస్థితుల లో టీడీపీ ని ఆశీర్వదించి చంద్రబాబు నాయుడు ను ముఖ్యమంత్రి ని చేసుకోవడం ఒక్కటే మార్గమని ప్రజలకు విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో కడప జిల్లా అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరి, ఇల్లూరు శ్రీనివాసులు, అరుణ్ తేజ్ ఫకీరయ్య,వంశీ కృష్ణ, మురళి,సందీప్, ఓబయ్య ప్రకాష్ సుబ్బరాయుడు, రవి,శివా చంద్రశేఖర్ బరే సుబ్బరాయుడు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాసుల యాదవ్, ప్రొద్దుటూరు నియోజకవర్గం బి సీ సెల్ అధ్యక్షుడు తమ్మిశెట్టి సురేంద్ర, సిద్దయ్య, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి సుంకర వేణుగోపాల్ , మెరువా మూర్తి,పెన్నా నగర్ మజీద్,టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిత్తశుద్ధితో ఉక్కు పరిశ్రమను పూర్తి చేయాలి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:




రాయలసీమ విద్యార్థి యువజన సంఘం (ఆర్ఎస్‌వైఎఫ్) 3వ జిల్లా మహాసభలు కడప నగరంలోని రాయలసీమ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర కార్యాలయంలో మొదటి రోజు మహాసభ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లెక్కల జోగిరామిరెడ్డి, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు నెలలకు శంకుస్థాపన చేసి, సంవత్సరానికి ఉక్కు పరిశ్రమ నిర్మాణాన్ని పూర్తి చేసి జిల్లాలోని 12వేల ప్రత్యక్ష ఉద్యోగాలు, లక్షకు పైగా పరోక్షంగా ఉద్యోగాల ద్వారా నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పిస్తానని మాయ మాటలు చెప్పి కుర్చీలో కూర్చున్న తరువాత హామీని గాలికి వదిలేసిన చరిత్ర కూడా సీఎం జగన్‌కు దక్కుతుందని వారు వాపోయారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కడప ఉక్కును చిత్తశుద్ధితో పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే విధంగా రాయలసీమ ప్రాంతం, విద్యారంగ, నిరుద్యోగుల సమస్యలపై భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడం కోసం ఆర్ఎస్‌వైఎఫ్ ఉద్యమ కార్యాచరణను కొనసాగించాలని వారు తెలిపారు. మహాసభల్లో నగర అధ్యక్ష, కార్యదర్శులు శివ, సోయల్, నగర సహాయ కార్యదర్శి రాజశేఖర్ నాయక్, నగర ఉపాధ్యక్షుడు కార్తీక్, వెంకటేష్, జిల్లా నాయకులు మురళి, మహేష్, చంద్ర, వెంకటేష్, అజయ్, విజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైల్వే గేటు సమస్యతో ప్రజలు అష్టకష్టాలు

కమలాపురం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:



కమలాపురం నడిబొడ్డున ఉన్న రైల్వే స్టేషన్ చీటికి, మాటికి ప్రతీ రోజూ ఎక్కువ సార్లు రైల్వే గేటు మూయడంతో పాటు ఒక్కో సారి మూడు, నాలుగు గంట ల రైలు పాస్ అయ్యేంత వరకు గేటు తెర వని పరిస్థితులు విధితమే. ఈ పరిణామాలతో ప్రయాణికులు ఒక పక్క గేటు వేసే సమయంలో వేగంగా తమ తమ వాహనాలను గేటు దాటించడం పరిపాటే అయ్యింది. అదే క్రమంలో గత సంవత్సరం ఇదే మాదిరి ఒక స్కూటరుపై ఇద్దరు వ్యక్తులు గేటు దాటే క్రమంలో గేటు వాహనదారుడిపై పడి తలకు బలమైన గాయాలై మృతి చెందిన విషయం ప్రజలకు, రైల్వే గేటు మెన్‌లకు అందరికీ తెలిసిందే. అయినా కూడా గేట్‌మెన్ గేటు వేసే క్రమంలో వచ్చే వాహనదారులను గమనించకుండా గేటు వేయడం ఒక ఎత్తయితే, గేటు వేస్తున్న క్రమంలో వాహనదారులు వేగంగా తమ వాహనాలను దూర్చడం ఇంకో ఎత్తు. అక్కడ మధ్యలో ఆగిన ఆటోను చూసిన వాహనదారులు ఇంకెంత కాలమో ఇలాంటి కష్టాలు, ప్రయాణికుల విన్యాసాలు అని వవాపోయారు.

# జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు

సిద్దవటం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:



జనసేన పార్టీ రాజంపేట నియోజకవర్గ యువ నాయకులు అతికారి దినేష్ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన సిద్దవటంలో క్రియాశీలక సభ్యత్వ కార్యక్రమం ముమ్మరంగా కొనసాగింది. అతికారి దినేష్ ఆధ్వర్యంలో బుధవారం జన సైనికులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై 200 మంది క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఫిబ్రవరి 10 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుంద న్నారు. జనసేన పార్టీ సభ్యత్వం చేసుకున్న వారికి ప్రమాద బీమా రూ.5లక్షలు, ఆసుపత్రి ఖర్చులకు రూ.50వేలు ఇవ్వడం జరుగుతుం దన్నారు. ఈ సందర్భంగా అతికారి దినేష్ మాట్లాడుతూ జనసేన పార్టీలో ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదు చేసుకొని పార్టీ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేసి జరగబోయే ఎన్నికల్లో పవన్ కల్యాణ్‌ను ముఖ్యమంత్రిగా చేయాలని దినేష్ పిలుపునిచ్చారు. మార్చి 14వ తేదీ జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జనసేన పార్టీ సిద్ధాంతాలు పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ ఆదేశాలతో ప్రతి ఇంటికి తీసుకెళ్తామని అన్నారు. కార్యక్రమంలో సిద్దవటం సర్పంచ్ ప్రతినిధి బి.ఓబు లయ్య, జనసేన పార్టీ మండల ఇన్‌ఛార్జి కె.రాజేష్, కల్యాణ్, ఆవుల నాగేంద్ర, ఎం.నాగరాజా, బీగాల సుబ్రమణ్యం, పోలిశెట్టి శ్రీనివాసులు, వి.బాలు తదితర జనసేన పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# థింకింగ్ డే బడెన్ పావెల్ జయంతి

బ్రహ్మంగారి మఠం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :



విద్యార్థి స్థాయి నుండి చదువుతో పాటు సేవా దృక్పథం కలిగి వుంటే మంచి భావి భారత పౌరులుగా ఎదగడానికి ఉపయోగపడుతుందని తహసీల్దారు కిషోర్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధ వారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కౌట్ అండ్ గైడ్ అనే సంస్థను స్థాపించిన రాబర్ట్ బడెన్ పావెల్ 166వ జయంతిని థింకింగ్ డే కార్యక్రమంగా స్కౌట్ మాస్టర్ ఖాదర్ బాషా ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులతో భారీ ర్యాలీగా మానవహారం నిర్వహించడం జరిగినది. అనంతరం ముఖ్య అతిధిగా విచ్చేసిన ఎంపీడీవో వెంగముని రెడ్డి మాట్లాడుతూ స్కౌట్ అండ్ గైడ్ క్రమశిక్షణకు మారుపేరు అని, అందులో సభ్యులందరూ క్రమశిక్షణతో ఉంటూ మంచి సమాజం నిర్మించేందుకు ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు నరసింహా రెడ్డి, ఏఎస్ఐ నరసింహ మూర్తి, స్కౌట్ కెప్టెన్ కరిష్మా, స్కౌట్ సభ్యులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# నేడు మండల సర్వసభ్య సమావేశం

మైదుకూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త

మైదుకూరు మండల పరిధిలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 23వ తేది గురువారం మండల సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించ నున్నట్లు మైదుకూరు ఎంపీడీవో కులాయమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని తెలియజేశారు.

# టిడిపి కార్యాలయంపై దాడులు పిరికిపంద చర్య

మైదుకూరు ఫిబ్రవరి 22, ప్రభాతవార్త



గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యా లయంపై వల్లభనేని వంశీ అనుచరులు, వైసీపీ నేతల దాడి చేయడం పిరికిపంద చర్య అని మాజీ కౌన్సిలర్ కొండ పేట షరీఫ్ అన్నారు. మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ మాజీ టిటిడి చైర్మన్ పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు మైదుకూరు మున్సిపల్ 5వ వార్డ్ టిడిపి కార్యాలయంలో బుధ వారం మాజీ కౌన్సిలర్ కడప పార్లమెంటు టిడిపి కార్యదర్శి షరీఫ్ మాట్లా డుతూ గన్నవరం తెలుగు దేశం పార్టీ కార్యాలయంపై వల్లభనేని వంశీ అనుచరులు, వైసీపీ నేతల దాడిని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో సైకోలకు గుండెల్లో భయం మొదలైందని తెలుగుదేశం పార్టీని ధీటుగా దమ్ముగా ఎదుర్కోలేక కార్యా లయాలపై దాడులు చేయటం సిగ్గుచేటని అన్నారు. రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ అధికారం లోకి వచ్చిన తర్వాత మీ భవిష్యత్తు ఎలా ఉంటుందో ఒకసారి గమనించాలని షరీఫ్ తీవ్రంగా హెచ్చరించారు.

# పెట్రోల్ బంకును తనిఖీ చేసిన తహశీల్దార్ విజయకుమారి

పోరుమామిళ్ల రూరల్ ఫిబ్రవరి 22, ప్రభాతవార్త



పోరుమామిళ్ల మండలంలోని నరసింగ పల్లె సమీపంలో ఉన్న భారత్ పెట్రోలియం పి.ఎస్.ఆర్ ఫిల్లింగ్ స్టేషన్‌ను బుధవారం ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పోరుమామిళ్ల తాసిల్దార్ విజయ్ కుమారి వారి సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెట్రోల్ బంక్ నందు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కల్పించినటువంటి సదుపాయాలను వినియోగదారులకు సక్రమంగా అందించాలని ఆమె తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఆర్ఐ యానాదయ్య, వీఆర్వో రామలక్ష్మమ్మ లు పాల్గొన్నారు.

# ఆర్ట్స్ కళాశాలలో క్షేత్ర పర్యటన

కడప ఫిబ్రవరి 22, ప్రభాతవార్త



జంతు శాస్త్ర శాఖ వారి ఆధ్వర్యంలో నెల్లూరు మత్స్య శాఖను సందర్శించ టానికి ఫైనల్ ఇయర్ విద్యార్థులు మత్స్య శాఖ ను సందర్శించారు. ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్ర నాథ్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రత్యక్షంగా వీక్షించడం ద్వారా విషయ సమగ్రహానం సులభమవుతుందని, జంతు శాస్త్ర శాఖ వారు ఇలాంటి కార్యక్రమాలు చేయటంలో ముందుంటారని కొనియాడారు. మత్స్య శాఖ నాగేశ్వరరాజు విద్యార్థులకు చేపల నిర్వహణ కోసం తీసుకునే చర్యలను వివరించారు. సురేష్ విద్యార్థుల కు రొయ్యలు చేపల చెరువుల పెంపకం యాజమాన్య విధానాలను ప్రత్యక్షంగా చూపించి వివరించారు. పర్వేష్ విద్యార్థులకు చేపల చెరువులు నిర్మాణం, వివిధ రకాల వ్యాదులు వాటి నిర్వహణ రవాణా లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. జంతు శాస్త్ర విభాగాధిపతి డా.పి.రవి శేఖర్ విద్యార్థులకు చేపల పెంపకం ఆవశ్యకత ను వివరించారు. కార్యక్రమంలో డా. వై.సావిత్రి, భోదనేతార సిబ్బంది రామ చంద్ర య్య శ్రీనివాసులు లక్ష్మి రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

# పునీత లారెన్స్ వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం

ఖాజీపేట ఫిబ్రవరి 22, ప్రభాతవార్త



ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని చెన్నముక్కపల్లె సచివాలయం పరిధిలో పునీత లారెన్స్ అనాథాశ్రమంలోని వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి,బిపి, షుగర్, ఒళ్ళు నొప్పులకు, మందులు, మాత్రలు ఇచ్చి ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఎస్. అయేషా సుల్తానా పరీక్షలు చేసి చికిత్సలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ అయేషా సుల్తానా వృద్ధులను ఉద్దేశించి మాట్లాడుతూ వృద్ధులు రోజు ఉదయం ఈ కాంపౌండ్ లోనే నడవాలని, నడక వలన బిపి, షుగర్, వ్యాధులు తగ్గతాయని ఆమె తెలిపారు. మండల ఆరోగ్య విస్తరణ అధికారులు మాచనూరు రాఘవయ్య, బి. నాగభూషణం మాట్లాడుతూ నడక తో పాటు ధ్యానం కూడ చేసుకోవాలని తెలియజేశారు, తాతలకు ఏదైనా అనారోగ్యం కలుగుతే వెంటనే ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొని వచ్చి పరీక్షలు చేయించి చికిత్సలు పొందాలని వారు ఆశ్రమ నిర్వాహకులకు తెలియ జేశారు. కార్యక్రమంలో పునీత లారెన్స్ అనాథ ఆశ్రమం నిర్వాహకులు చెన్నయ్య, మండల ఆరోగ్య విస్తరణ అధికారులు మాచనూరు రాఘవయ్య. బి. నాగభూషణం, సిహెచ్ ఓ వెంకటసుబ్బమ్మ, పిహెచ్ యన్ అరుణ కుమారి, ఏయన్ యం వెంకటతులసి, ఆశా కార్యకర్త ఆరోగ్యమ్మ, వృద్దులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న సిఐ మంజూనాథరెడ్డి

ఎర్రగుంట్ల ఫిబ్రవరి 22, ప్రభాతవార్త



ఎర్రగుంట్ల మండలంలోని తిప్పలూరు గ్రామంలో ఉన్న ఎద్దుల పెద్ద శేషమ్మ వృద్ధాశ్రమంలో బేతంచెర్ల సత్య రాజు అనే వృద్దుడు మరణించిన విషయం తెలుసుకున్న ఎర్రగుంట్ల పట్టణ సీఐ మంజునాథ రెడ్డి వెంటనే స్పందించి ఆ అనాథ శవానికి తన సొంత ఖర్చులతో అంత్యక్రియలు నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రగుంట్ల పట్టణంలో ఎవరైనా అనాథలు మరణిస్తే తనకు వెంటనే తెలియజేయాలని తన సొంత ఖర్చులతో అంత్యక్రియ నిర్వహిస్తానని, ఇలా చేయడం వల్ల తనకు ఆత్మ సంతృప్తి కలుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిఐ మంజునాథరెడ్డితో పాటు కానిస్టేబుల్ సుబ్బ రాయుడు, గోవర్ధన్, వినయ్ కుమార్ రెడ్డి, సురేంద్ర, ఎద్దుల శేషమ్మ వృద్ధాశ్రమ చైర్మన్ ఎద్దుల నాగేంద్ర, అభి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజయ్ బాబు పాల్గొన్నారు.

# సమస్యల సత్వర పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

## ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

పొద్దుటూరు ఫిబ్రవరి 22, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు నియోజక వర్గ ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే గడపగడపకు మన ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు బుధవారం కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని గండ్లూరు కొట్టాల మీనాపురం గ్రామంలో సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి రెండవ వార్డ్ మెంబర్ ఇందిరమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భం గా ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. ఆయన సానుకూలంగా స్పందిస్తూ మీ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు అనంతరం శ్రీ రాజ రాజేశ్వరి దేవి సమేత శ్రీ శ్రీ భీమ శంకర ఆలయం నందు ప్రత్యేక హోదా నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు ఈ కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్పర్సన్ మల్లెల ఝాన్సీ రాజారామ్ రెడ్డి ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ రాష్ట్ర వైసిపి అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి వైసిపి నాయకులు కాకర్ల నాగ శేషారెడ్డి బండారు సూర్యనారాయణ యువ నాయకులు కొనిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి బినాపురం వైసిపి నాయకులు చంద్రశేఖర్ రెడ్డి అజయ్ యాదవ్ అశోక్‌యాదవ్ భాష సుబ్బయ్య పాల్గొన్నారు.

# నేడు-రేపు బిజెపి రాష్ట్ర అధ్యక్షుల పర్యటన

మదనపల్లె, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :



బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోమువీర్రాజు 23, 24వ తేదీల్లో రెండు రోజులు పాటు మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో పర్యటించ నున్నట్లు బిజెపి రాజంపేట జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఏవి.సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 23న పుంగనూరు, పీలేరు నియోజకవర్గాల్లో పర్యటిస్తారన్నారు. అదే విధంగా 24న శుక్రవారం మదనపల్లె, తంబళ్ళపల్లె నియోజకవర్గాల్లో పర్యటించి బిజెపి కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం ఓటర్లను కలసి ఓట్లు అభ్యర్థించనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారానికి బిజెపి కార్యకర్తలు సన్నద్ధం చేయనున్నట్లు తెలిపారు.రాష్ట్ర అధ్యక్షులు జరిపే పర్యటనలో ఆయా నియోజకవర్గాల్లోని బిజెపి కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఆర్టీసి వన్‌డిపో మేనేజర్‌కు ప్రసంశాపత్రం అందజేత

మదనపల్లె, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :



మహాశివరాత్రి పండగను పురస్కరించుకొని రెండు రోజులు పాటు మదనపల్లె ఆర్టీసి వన్‌డిపో నుంచి బస్సు సర్వీసులను నడిపి ఎక్కువుగా ఆర్టీసికి ఆదాయం వచ్చినందు వల్ల డిపో మేనేజర్ ఎం.వెంకటరమణారెడ్డికి బోర్డు డైరెక్టర్ రాజారెడ్డి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. బుధవారం డిపో మేనేజర్ విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 18, 19వ తేదీల్లో పండగ సందర్భంగా స్పెషల్ ఆర్టీసి బస్సులు ఆపరేట్ చేసినందుకుగానూ ఆర్టీసికి రూ.16.27లక్షలు ఆధాయం వచ్చిందన్నారు. అదే విధంగా ఈపికే 91.75, ఓఆర్ 171 సాధించడం జరిగిందన్నారు. ఈ ఫలితాలు సాధించినందుకుగానూ బోర్డు డైర్క్టర్ రాజారెడ్డి ప్రసంశాపత్రాన్ని అందజేశారన్నారు. డిపోసూపర్‌వైజర్లు, సిబ్బందికి అభినందనలు తెలియజేశారు.

# 28లోగా రైతులు ఈకేవైసి చేసుకోవాలి

వ్యవసాయ అధికారి నాగేంద్రప్రసాద్

మదనపల్లె, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:

2022-23 సంవత్సరానికి సంబంధించి రబీ పంటసాగుకు సంబంధించి రైతులు ఈనెల 28లోపు ఈకేవైసి చేసుకోవాలని వ్యవసాయ అధికారి నాగేంద్ర ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. సంబందిత ఆర్బీకేలను సంప్రదించి రైతులు ఈకేవైసి చేసుకోవాలన్నారు. ఈకేవైసి చేసుకోని రైతుల వివరాలు పరిగణలోకి రావన్నారు. ప్రతి రైతు ఆర్బీకే కార్యాలయాలను సంప్రదించి నెలాఖరులోపు ఈకేవైసిచేసుకోవాలని సూచించారు.

# మదనపల్లెలో రావణకష్ట ఫిల్మ్ చిత్రీకరణ

మదనపల్లె, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :



పట్టణానికి చెందిన కళాకారులు బుధవారం రావణకష్ట ఓటిటి ఫిల్మ్ చిత్రీకరణకు శ్రీకారం చుట్టారు. పట్టణంలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి ఈ ఫిల్మ్‌కు క్లాప్‌కొట్టి ప్రారంభించారు. దర్శకులు బిఆర్.ప్రసాద్ మాట్లాడుతూ మనిషిలో అహం, క్రోదం, ద్వేశం, ప్రేమ, సమ్మిళతమా ఈ రావణకష్ట మనసుకు హత్తుకునే కథ అని చిత్రీకరణ అన్నారు. పట్టణ పరిసర ప్రాంతాల్లో ఈ చిత్రీకరణ వారంరోజులు పాటు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమేష్‌కుమార్, స్నేహ, ఆచార్య, ఉదయ్‌కుమార్, దినకర్ పులకుంట్ల, సయ్యద్‌బాషా, రాధిక తదితరులు పాల్గొన్నారు.

# రామసముద్రం కొండ ప్రాంతంలో నెమలి

పురివిప్పి నెమలి నాట్యం కనుల విందు

రామసముద్రం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:



రామసముద్రం మండలానికి కొద్ది దూరంలో కర్నాటక బార్డర్ ఉండడంతో అక్కడ చుట్టూ కొండలు, అటవీప్రాంతం ఉంది. ఈ గుట్టప్రాంతాల్లో ఓ నెమలి బుధవారం పాదచారులను అకట్టుకొంది. అదే గుట్ట ప్రాంతంలో నెమలి సాయంత్ర సమయాన వాతావరణం చల్ల బడడంతో ఆహ్లాదంగా నాట్యం చేసింది. ఈనెమలి పురి విప్పి.. నాట్యం చేసిన దృశ్యాలను యువత కొందరు కెమెరాలో బంధించి వాట్సప్, పేస్‌బుక్, ట్విటర్స్‌లలో హాల్‌చల్ చేశారు. కనువిందచు చేసిన నెమలి నాట్యంను తనివితీరా తిలకించామని చెప్పుకొచ్చారు.

## మామిడి తోటల్లో ... పూత సువాసలు...!

రామసముద్రం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:



పడమటి ప్రాంతాల్లోని పుంగనూరుజిల్లా, అన్నమయ్యజిల్లా రామసముద్రం నియోజకవర్గంలోని మామిడి తోటలు సువాసనలు వెదజల్లుతున్నాయి.. గతంలో ఎన్నడూ లేనివిధంగా మామిడి చెట్లు మామిడి పూతతో కళకళలాడుతున్నాయి. జాతీయ రహదారికి ఇరువైపులా వున్న ఈమామిడి తోటల వద్ద మామిడిపూలు వాసనతో ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి. ఈమామిడి తోటలు కనువిందు చేస్తున్నాయి.

# నలుగురిపై వేధింపుల కేసు నమోదు

మదనపల్లెక్రైం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:

ఓ వివాహిత ఫిర్యాదు మేరకు నలుగురిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు రెండవ పట్టణ ఏఎస్ఐ వెంకటరమణ తెలిపారు. ఆయన కథనం మేరకు మదనపల్లె పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన జ్యోతి అనితకు 2019లో బి.కొత్తకోట మండలం బండారువారిపల్లెకు చెందిన వెంకటేశ్వర్లతో వివాహమైంది. ఈ క్రమంలో కొద్దిరోజులు పాటు దంపతుల కాపురం సజావుగా సాగింది. ఆ తరువాత అత్తింటివారు అదనపు కట్నం కోసం వేధించడం మొదలుపెట్టారు. దీంతో బుధవారం అత్తింటివారిపై రెండవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వెంకటేశ్వర్లు అతని తల్లిదండ్రులు మునితర్నం, సరస్వతి, సోదరుడు శ్రీకాంత్‌లపై వరకట్నం వేధింపులు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

# 600 లీటర్ల సారాయి ఊట ధ్వంసం

కేవి.పల్లె, ఫిబ్రవరి 22 ప్రబాతవార్తః



ఎస్ఈబీ సీఐ గురప్రసాద్‌కు అందిన రహస సమాచారం మేరకు బుధవారం కేవి.పల్లె మండలం జిల్లేళ్లమంద తాండాకు చుట్టుపక్కల అడవి ప్రాంతంలో దాడులు చేయగా సుమారు 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేశామన్నారు. ఈదాడిలో సిబ్బంది రాఘవయ్య, లోకేష్, సుధాకర్, సురేష్‌లు పాల్గొన్నారు.

# బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

మదనపల్లెక్రైం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:



బావిలో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకొన్నాడు. ఈ సంఘటన బుధవారం మదనపల్లె మండలంలో జరిగింది. తాలూకా పోలీసుల కథనం మేరకు మండలంలోని చీకలబైలు పంచాయితీ జమ్ముకుంటపల్లెకు చెందిన హరిబాబు(35) కూలిపనులు చేస్తుండేవాడు. ఇతనికి భార్య కళావతి ఉంది. ఈనేపథ్యంలో సమాయానికి అన్నం పెట్టలేదని బుధవారం ఇంటిలో వారితో గొడవపడ్డాడు. అనంతరం ఇంటిలో నుంచి అలిగి వెళ్ళిపోయి గ్రామ సమీపాన ఉన్న ఓ బావిలో దూకి ఆత్మహత్య చేసుకొన్నాడు. కాగా మృత దేహం బావిలో తేలి ఉండడాన్ని స్థానికులు గుర్తించి బాధిత కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు బావివద్దకు చేరుకొని బోరున విలపించారు. సమాచారం అందుకొన్న తాలూకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని స్థానికులు సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. అలాగే మృతదేహాన్ని పరిశీలించి ఘటనపై ఆరా తీశారు. అయితే అన్నం కోసం కుటుంబ సభ్యులతో గొడవపడి అలిగి ఆత్మహత్య చేసుకొన్నట్లు బంధువులు చెప్పారు. ఈ క్రమంలో మృదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

# మొరుసుకాపురెడ్డి కులస్థులకు బిసి సర్టిఫికెట్లు ఇవ్వాలి

కురబలకోట, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:



మొకుసుకాపు రెడ్డి కులస్థులకు బిసి సర్టిఫికెట్లు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం ఆ కులసంఘం నాయకులు కురబలకోట తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మట్లివారిపల్లె సర్పంచ్ సోమిరెడ్డి, వైఎస్ఆర్ సిపి నాయకులు ముట్రా దామోదర్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, రమేష్‌రెడ్డి, వాసుదేవరెడ్డిలు మాట్లాడుతూ ప్రభుత్వం జిఓనెంబర్ 33 ప్రకారం మొరుసుకాపు రెడ్లకు బిసి కులధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలని జిఓ జారీ చేసినా ఇంతవరకు అధికారులు అమలు పరచలేదని ఆరోపించారు. ప్రభుత్వం నాలుగేళ్ళ క్రితం ఈ జిఓను జారీ చేసిందని వారు తెలిపారు. ఈ జీఓను అధికారులు అమలు చేయనందున ప్రతి కుటుంబంలోని యువతీ, యువకులు విద్యా, ఉద్యోగ అవకాశాలు కోల్పోవడమే కాకుండా ప్రభుత్వ పథకాలు కూడా అర్హులైన వారికి లభించక ఆర్థికంగా నష్టపోయారని వారు దుయ్యబట్టారు. బిసి సర్టిఫికెట్లు మంజూరు చేసేలా అన్ని గ్రామ సచివాలయాల విఆర్ఓలకు సర్క్యులర్లు జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ భీమేశ్వర్‌రావుకు కులసంఘం నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి రవీంద్రారెడ్డి, వేణురెడ్డి, సధానందరెడ్డి, కోళ్ళవాసుదేవరెడ్డి, వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నూతన టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలి

కురబలకోట, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:



ఎంసిఏ విద్యార్థులు నూతన టెక్నాలజీలపై అవగాహన పెంచుకోవాలని ముఖ్య అతిధులు ప్రొపెసర్లు శర్మ, లీలా క్రిష్ణలు అన్నారు. బుధవారం మిట్స్ కళాశాలలో ఎంసిఏ విద్యార్థులకు, తల్లిదండ్రులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐటి ఇండ్రస్టీలో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. ఎంసిఏ విద్యార్థులు కమ్యూనికేషన్‌స్కిల్స్‌పై పట్టు సాధించాలన్నారు. నూతన టెక్నాలజీలైన డేటాసైన్స్ ఇంటలిజెన్స్, సైబర్‌సెక్యూరిటి స్కిల్స్ డెవలెప్‌మెంటుపై పట్టు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్, ప్లేస్‌మెంటు అధికారి వేణు, సీనియర్ మేనేజర్ గౌడ, ఎంసిఏ విభాగాధిపతి నవీన్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గర్బవతుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

కురబలకోట, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :



గర్బవతుల పట్ల ప్రత్యేక వైద్యసేవలు అందించాలని రాష్ట్రస్థాయి నోడల్ అధికారి విజయకుమార్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన అన్నమయ్యజిల్లా ఉషశ్రీతో కలసి కురబలకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో గర్బవతులను పరీక్షించి ప్రత్యేకవైద్యసేవలను అందించాలన్నారు. రక్త హీనత, హైరిస్క్ గర్బిణీల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని కాన్పులగది, ల్యాబు, మందులగది, ఫ్రిజులను వారు పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. వారివెంట వైద్యాధికారులు శ్రీధర్, క్రిస్టల్‌దాస్, సిహెచ్ఓలు జయచంద్రకుమార్, నారాయణ, వైద్యసిబ్బంది కలరు.

# లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయండి

పీలేరు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్తః



తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి, ఎ మ్మెల్సీ యువనేత నారా లోకేష్ ప్రతిష్టాత్మకంగా చేపట్టి న యువగళం పాదయాత్ర మార్చి మొదటివారంలో పీలేర నియోజకవర్గ పరిధిలో జరగనుందని పాదయాత్రను విజయవంతం చేయాలని తెదేపా జాతీయ నేత, పీలేరు నియోజకవర్గ బాధ్యులు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని తెదేపా కార్యాలయం వేణుమహ ల్‌లో కిశోర్‌కుమార్‌రడెిడ్డి పీలేరు మండల పార్టీ శ్రేణులతో సమావేశమైయ్యారు. పీలేరు నియోజకవర్గంలో మూడు రోజులు పాటు జరిగే సభలు, సమావేశాలు బస చేయడం జరుగుతుందని అందుకు సంబంధించిన ఏర్పాట్లు స్వయంగా పరిశీలించి పర్యవేక్షించినట్లు తెలిపారు. వేపులబైలు గ్రామం వద్ద నారా లోకేష్ బీసీలతో సమావేశం కలికిరి పట్టణంలో మైనారిటీలతో సమావేశం వాల్మీకిపురం చింతపర్తిలో ఎస్సీలతో సమావేశం జరుపుతూ వారి సమస్యలపై స్పందిస్తూ వారికి ధైర్యాన్ని ఇచ్చేవిధంగా వాళ్లతో పరిచయాలు, హామీలు కార్యక్రమాలు ఉంటాయన్నారు. లోకేష్ పాదయాత్రలో పాల్గొనే గ్రామ బూత్‌లెవల్ కమిటీ సభ్యులు, యువత అనుబంధ సంఘాలు తమ వివరాలు తెలిపి యువగళం బ్యాచ్‌లాగా మండలాల వారిగా గుర్తింపు కార్డులు పొందాలని అన్నారు. పీలేరు నియోజకవర్గ పరిధిలో మూడురోజుల పాటు జరిగే లోకేష్ యువగళం పాదయాత్రను తెదేపా కుటుంబ సభ్యులు, నల్లారి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## వైద్యసిబ్బంది సీజనల్ వ్యాధులపై దృష్టి సారించాలి

– సీహెచ్‌వో సుచిత్ర

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె మండలంలోని వైద్యసిబ్బంది సీజనల్ వ్యాధులపై దృష్టి సారించాలని కోసువారిపల్లె పీహెచ్‌సీ సీహెచ్‌వో సుచిత్ర పిలుపునిచ్చారు. బుధవారం కోసువారిపల్లె ప్రభుత్వాసుపత్రిలో మండలంలోని వైద్య సిబ్బందితో ఆమె సమీక్ష నిర్వహించారు. మండలంలోని సచివాలయ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది స్థానిక పాఠశాలలు, కళాశాలలు గురుకుల పాఠశాలల్లో తరచూ వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా బాలికల వైద్యం, వ్యక్తిగత పారిశుద్ధ్యం, నేడు ప్రబలుతున్న విష జ్వరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి మారుమూల గ్రామాల్లో గ్రామీణులకు ఆరోగ్య సూత్రాలు పాటించాల్సిన బాధ్యత వైద్య సిబ్బంది తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో వెంకటరమణ, ఏఎన్ఎం ప్రమీల,రామలక్ష్మి, తులసి, అలీమా, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## తాడేపల్లె ఆదేశాలతోనే రాష్ట్రం రావణ కాష్టం

– అరాచక, అనాగరిక పాలన సాగిస్తున్న సీఎం జగన్‌రెడ్డి

– టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా

రాయచోటి రూరల్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:



రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వ అరాచక, విధ్వంసక పాలన ఆగడాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నియంత పోకడలు, ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టుగా మారాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా తీవ్రంగా దుయ్యబట్టారు. బుధవారం ఆయన రాయచోటి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక పాలనను ప్రశ్నిస్తే ప్రజలు, ప్రతిపక్షాలపై దాడులు, కేసులు, హింసాత్మక ఘటనలు, పోలీసుల టార్చర్ అన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఇందుకు గన్నవరం విధ్వంసం తాజా ఉదాహరణ అన్నారు. గన్నవరం ఘటనలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై, పార్టీ నేతల ఇళ్లపై, కార్యకర్తలపై దాడులు చేసి వారి ఆస్తులు ధ్వంసం చేయడంతో పాటు వారినే పోలీసులు టార్చర్‌కు గురి చేసి ఆ బాధితులనే నిందితులుగా మార్చి జైలుకు పంపిన వైనం చరిత్రలో ఎన్నడూ ఎక్కడ జరగలేదన్నారు.కోవిడ్ సమయంలో మాస్కులు అడిగిన డాక్టర్ సుధాకర్ మద్యంపై ప్రశ్నించిన ఓం ప్రతాప్‌ల ప్రాణాలు తీశారన్నారు. ఇసుక మాఫియాను ప్రశ్నించిన వరప్రసాద్‌కు పోలీసు స్టేషన్‌లోనే శిరోముండనం చేశారన్నారు. ఇలాంటి ఘటనలు రాష్ట్రంలో ప్రతి చోటా జరుగుతున్నాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనలకు అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన కనిపిస్తోందన్నారు. ఇటీవల జగ్గంపేట, పెద్దాపురం పర్యటనల అనంతరం ప్రజా స్పందన చూసి భయపడిన ఈ ప్రభుత్వం అనపర్తి సభకు అడ్డంకులు సృష్టించిందన్నారు. సభకు ముందుగా అనుమతులు ఇచ్చిన పోలీసులు ప్రభుత్వం ఒత్తిడితో అడ్డంకులు సృష్టించారన్నారు.సీఎం ఒత్తిడితో ఎన్నడూ లేని విధంగా ఏకంగా వెయ్యి మంది టీడీపీ కార్యకర్తలపై అనపర్తిలో తప్పుడు కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో చిన్నమండెం మండల టీడీపీ అధ్యక్షుడు బెల్లం నరసింహారెడ్డి, రాజంపేట పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి హరి అమర్నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్థవంతంగా అమలు చేస్తాం

– ఎన్నికల అధికారి తహసీల్దార్ కళావతి

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:

తహసీల్దారు కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ కళావతి సహచర అధికారి ఆనంద్‌కుమార్‌తో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికలకు 793, టీచర్ల ఎన్నికకు 12 మంది నమోదైనట్లు తెలిపారు. ఉన్నత ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు తంబళ్లపల్లె మండలంలో ఎలక్షన్ కోడ్ కొనసాగుతున్నట్లు చెప్పారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా సంబంధిత కింది స్థాయి అధికారులు ఎలాంటి సమస్య వచ్చినా తన దృష్టికి తేవాలని పరిష్కారానికి కృషి చేస్తానని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా కొత్త పథకాలు ప్రారంభించరాదని అవసరమైతే అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష జరిపి ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల కోడ్ నిబంధనలను కింది స్థాయి ఉద్యోగులు తప్పక పాటించి తీరాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దారు లావణ్య, ఆర్ఐ రవి, వీఆర్వో శ్రీరాములు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ వర్ధంతి వేడుకలు

పీలేరు, ఫిబ్రవరి 22 ప్రబాతవార్తః



పీలేరు నియోజకవర్గం కలికిరి మండలంలో ఉయ్యాలవాడ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొట్టమొదటి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 176వ వర్ధంతి వేడుకలను కలికిరి పట్టణంలోని ధరణిహోటల్ వద్ద రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు పులి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. రెడ్డి సంఘం అధ్యక్షులు పులి సత్యనారాయణరెడ్డి, ప్రముఖ సాహితీవేత్త శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ మాజీ పాలకమండలి సభ్యులు వేంపల్లె అబ్దుల్ ఖాదర్‌లు మాట్లాడుతూ బ్రిటీషు సామ్రాజ్యాన్ని గడగడలాడించిన పోరాట యోధుడు, స్వాతంత్ర్య పోరాటంలో తొలిగర్జన, సిపాయిల తిరుగుబాటును తరతరాల స్పూర్తి తెల్ల దొరల పాలన సమయంలో రాయలసీమ పౌరుషం భగ్గుమందని ఆరడుగుల సీమ సింహం జూలు వెదిలించిందని ఆసింహమే ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అంటూ కొనియాడారు. ఈకార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు భాస్కర్‌రెడ్డి, సహదేవరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మైనారిటీ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు హనీఫ్, మోహన్‌రెడ్డి, సిద్దయ్యతదితరులు పాల్గొన్నారు.

## సార్వత్రిక ఇంటర్ అడ్మిషన్లకు ప్రత్యేక అవకాశం

వేంపల్లె, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :

ఇంటర్మీడియట్ అర్థాంతరంగా మానేసిన విద్యార్థుల కోసం ఏపీ ఇంటర్ బోర్డు సార్వత్రిక విధ్యా విధానాన్ని ప్రవేశ పెట్టినట్లు వేంపల్లె ఉర్దూ జూనియర్ కాలేజి ప్రిన్సిపల్ హబీబుల్లా బుధవారం తెలిపారు. వీరికి శిక్షణ ద్వారా ఏప్రిల్ మాసంలో సార్వత్రిక విధానం ద్వారా పరీక్షలు నిర్వహిస్తాన్నారు. ఇంటర్ చేరదలచిన వారు ఈనెల 27వ తేదీలోగా 10వ తరగతి మార్కుల జాబితాతో కాలేజిలో సంప్రదించాలన్నారు. రిజిస్ట్రేషన్, అడ్మిషన్, లేట్‌ఫీజు, మైగ్రేషన్ ఫీజుల కింద ఓసీ అభ్యర్థులు రూ.2300, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.2000 చెల్లించాలని తెలిపారు. అలాగే ఒక్కో సబ్జెక్టుకు రూ.200 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందని ప్రిన్సిపల్ హబీబుల్లా చెప్పారు.

# అగస్తేశ్వరాలయానికి గ్రైండర్ వితరణ

కమలాపురం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:

కమలాపురం నియోజకవర్గం చదిపిరాళ్ల గ్రామంలో వెలసిన అగస్తేశ్వరాలయంలో అంగరంగ వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులు అప్పల్‌రెడ్డి సుభద్రమ్మ, అప్పల్‌రెడ్డి సరస్వతమ్మ, అప్పల్‌రెడ్డి ఈశ్వర్‌రెడ్డిలు ఆలయానికి ఉత్సవాల సమయంలో ప్రజలకు అన్నదానం చేసేందుకు వీలుగా గ్రైండర్ వితరణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారికి ధన్యవాదాలు తెలిపారు.

# పరిహారం పంపిణీ వేగవంతం చేయండి

అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

పీలేరు, ఫిబ్రవరి 22 ప్రబాతవార్తః



మదనపల్లె-పీలేరు రహదారికి భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం పంపిణీ వేగవంతం చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. బుధవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో జాతీయ రహదారి 71 మదనపల్లె- పీలేరు భూసేకరణ, నష్టపరిహారం పంపిణీ వేగవంతంపై నేషనల్ హైవే అధికారులు, వీఆర్ఓలతో కలెక్టర్ గిరీషా పీఎస్ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పీలేరు-మదనపల్లె నాలుగు లైన్ల జాతీయ రహదారి పూర్తైతే ఈప్రాంతం మరింత అభివద్ధి చెందుతుందన్నారు. కావున పెండింగ్ భూసేకరణ వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు వేపలబైలు, బోడుమల్లువారిపల్లె, గూడరేవుపల్లె తదితర గ్రామాల వీఆర్ఓలతో కలెక్టర్ సుదీర్ఘంగా సమీక్షించి వీలైనంత త్వరగా భూసేకరణ పూర్తిచేసి నేషనల్ హైవే అధికారులకు అప్పజెప్పాలన్నారు. అందులో ప్రభుత్వ భూమి, డీకేటీ భూమి, పట్టాభూమి ఎన్ని ఎకరాలు, ఇంకా ఎన్ని ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయి వంటి వివరాలు అడిగి తెలుసుకుని ఫైల్స్ పెండింగ్ లేకుండా త్వరగా క్లియర్ చేయాలన్నారు. భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లింపు 80 శాతం చేరుకోవాలని అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి వెల్లేదారిలో లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణం జరిగాయని వారికి పరిహారం చెల్లింపు కోసం ఎంత ఖర్చు చేశారో అంత ఎస్టిమేషన్ తయారుచేయాలని హౌసింగ్ డీఈని కలెక్టర్ ఆదేశించారు. ఈకార్యక్రమంలో తహశీల్దారు రవి, ఎన్‌హెచ్ డీప్యూటీ తహశీల్దారు గురుప్రసాద్, వీఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ

వాల్మీకిపురం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్తః



ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని స్థానిక జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుచరణ్ అన్నారు. బుధవారం మండలంలోని చింతపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో నరసింహారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్‌ఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ క్రీ.శ 1845 వ సంవత్సరంలో ప్రారంభమైన నరసింహారెడ్డి పోరాటం 1847 జనవరి 9 వరకు సాగిందని పరాయి పాలకులకు సింహస్వప్నంలా మారిన నరసింహారెడ్డిని 1847 ఫిబ్రవరి 22వ తేదీ కోవెలకుంట్లలో జుర్రేటి నది ఒడ్డున వేలాదిమంది ప్రజల సమక్షంలో ఉరివేయించడమే కాకుండా ఆయన శిరస్సును 1877 సంవత్సరం వరకు 33 సంవత్సరాల పాటు కోవెలకుంట కోటలో ఉరికొయ్యను వేలాడదీసి ఉంచారని గుర్తుచేశారు. అలా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన మొదటి భారతీయుడు ఉయ్యాలవాడ అన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు భారతి, యోగారంజని, సరస్వతమ్మ, గురువమందాడి, సరిత, విద్యార్తులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ భవనానికి స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్‌కు వినతి

పీలేరు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్తః



స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అంబేద్కర్ భవనానికి స్థలాన్ని కేటాయించాలని మాలమహానాడు, ఎమ్మార్పీయస్ ఆధ్వర్యంలో జిల్లా పాలనాధికారి గిరీషా పీఎస్ గారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా పీలేరు మండలంలో అంబేద్కర్ భవనం కోసం స్థలం కేటాయించాలని జిల్లా, మండల స్థాయి అధికారులకు వినతిపత్రాలు సమర్పించడం జరిగిందన్నారు. భవనానికి అనువులేనిచోట స్థలాన్ని కేటాయించారు. అయితే పీలేరు మండలంలో ప్రభుత్వభూముల దురాక్రమణలో భాగంగా గూడరేవుపల్లె గ్రామం రెవెన్యూ దాఖలా సర్వే నెంబరు 200-3 లో 0.53 సెంట్లు భూమిని రెవెన్యూ శాఖ స్వాధీనం చేసుకున్నారు. కావున ఆస్థలాన్ని అంబేద్కర్‌భవనం కొరకు కేటాయించాలని మేకలవాని కాలువ రోడ్డు దురాక్రమణకు గురై అక్రమ కట్టడాలకు నిలయంగా మారడంతో పాఠశాలలకు వెళ్లు విద్యార్థులు, ప్రజలకు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో మల్లికార్జున, సుబాస్, తిమ్మయ్య, రవీంద్రబాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలలో సుస్థిర అభివద్దే లక్ష్యం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్తః



అంగన్‌వాడీలలో సుస్థిర అభివద్ధి లక్ష్యమని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ధనలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో వాల్మీకిపురం, గుర్రంకొండ, కలికిరి, కలకడ, మండలాలకు సంబంధించి అంగన్‌వాడీల సుస్థిర అభివద్ధి లక్ష్యాలపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన నాలుగు మండలాల అంగన్‌వాడీలను ఉద్దేశించి ధనలక్ష్మి మాట్లాడుతూ గర్బిణీలకు ఏడబ్లూసీ నందు ప్రతిరోజు పాలు, గుడ్డుతో పాటు భోజనం తిసుకునేవిధంగా చూడాలన్నారు. అలాగే నిత్యం గర్బిణీలు కాల్షియం, ఐరన్ మందులు తీసుకునేలా సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ ల పరిధిలో బరువు తక్కువగా ఉన్న పిల్లలను ఖచ్చితంగా గుర్తించాలని సూచించారు. గర్బిణీలు, బాలింతలు, ఏడు నుంచి మూడు సంవత్సరాలు మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు వైఎస్సార్ ఎస్పీ పథకం కింద పౌష్టికాహారం ఏవిధంగా పంపిణీ చేయాలన అంశంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈకార ్యక్రమంలో సీడీపీఓ భారతి, సూపర్‌వైజర్ రోహిణి, యశోద, మహాలక్ష్మి, విజయలక్ష్మి, సుశీల, రాణి, నాలుగు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## స్వశక్తితో మహిళలు ఆర్థికశక్తిగా ఎదగాలి

ఎంపిడిఒ నాగార్జున

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త



సమాజంలోని మహిళలు స్వశక్తితో ఆర్థికశక్తిగా ఎదగాలని రైల్వేకోడూరు ఎంపిడిఒ నాగార్జున అన్నారు. బుధవారం రైల్వేకోడూరు పట్టణంలోని గ్లోబల్ ట్రస్టుకు చెందిన మగ్గం చేనేత పని నేర్చుకొన్న మహిళలకు సర్టిఫికెట్ ప్రధానం చేస్తున్న సందర్భంగా వారు ప్రత్యేక ముఖాముఖి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళలు మగ్గం నేర్చే పనిలో మహిళలు ఎంతో ఆసక్తి చూపుతున్నారని, ఒక చిన్న జాకెట్ కుడితే దాదాపు 500 రూపాయలు వస్తున్నదని, అదే మగ్గం ద్వారా కుట్టబడిన వస్త్రాల ద్వారా వేలాది రూపాయలు పొందవచ్చునని అన్నారు. గ్లోబల్ ట్రస్టు మహిళలకు ఇటువంటి సహాయ సహకారాలు అందించడం ఎంతో సంతోషించదగ్గ విషయమని అన్నారు. బ్యాంకుల లింకేజి ద్వారా పూర్తిస్థాయిలో సమాజంలోని మహిళలు ఆర్థికంగా ఎదగవచ్చునని అన్నారు. అనంతరం ఎంపిడిఒ నాగార్జునను పూలమాలలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, గ్లోబల్ సంస్థ ఫౌండర్ పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

## వలంటీర్లు, గహసారధులు ప్రభుత్వానికి వారధులుగా పనిచేయాలి

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కేవి.పల్లె,, ఫిబ్రవరి 22 ప్రభాతవార్తః



వలంటీర్లు, గహసారధులు ప్రభుత్వానికి వారధులుగా పనిచేయాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం కేవి.పల్లెలో గహ సారధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలవేసి పూజలు జరిపి ఘనంగా నివాళులు అర్పించారు. సదస్సును ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ సచివాలయ వ్యవస్థ, అన్ని బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరిగే విధంగ నవరత్నాలు లాంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అని న్ని వర్గాల ప్రజలను సంతృప్తి పరుస్తూ పాలనను సీఎం సాగిస్తున్నార న్నారు. ప్రజలకు ప్రభుత్వ పాలనను మరింత దగ్గర చేస్తూ వాలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చి ఏపీని అభివద్దిలో నిలిపేందుకు కషిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివద్దిని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత గహ సారధులపై ఉందన్నారు. ఈసందర్బంగా వడ్లకుంట పంచాయతీ నుంచి కేవి.పల్లె పంచాయి బండవడ్డిపల్లె గ్రామానికి చెందిన సుమారు వందమందికి పైగా వైసీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జీవి.శ్రీనాధరెడ్డి, డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, నియోజకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, కడపగిరిధర్‌రెడ్డి, జడ్పీటీసీ గజ్జలశ్రుతి, ఎంపీపీ ఈశ్వరమ్మ, మండల పార్టీ అధ్యక్షులు వెంకటరమణారెడ్డి, మండల యూత్ కన్వీనర్ గజ్జల శీనురెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ సతీష్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు సైపుల్లాఖాన్, సర్పంచిలు, ఎంపీటీసీలు నాయకులు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆకస్మిక తనిఖీ

– అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్ వల్లి

కమలాపురం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:



కమలాపురం పంచాయతీ పరిధిలోని మూడు రోడ్ల కూడలి వద్ద ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ను బుధవారం అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో ఖాదర్ వల్లీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ యూపీహెచ్‌సీకి వివిధ వ్యాధులతో వస్తున్న రోగులకు మంచి వైద్యం అందించాలన్నారు. అనీమియా, హైరిస్క్ గర్భిణీ స్త్రీలను ఏ విదంగా రెఫర్ చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. మందుల కొరత ఏమైనా ఉందా, ఇంకా రావాల్సిన పరికరాలు ఉన్నాయా అని వైద్యాధికారి డా.నందకుమార్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి డా.నందకుమార్, స్టాఫ్‌నర్సులు, ఆపరేటర్ శ్రీనివాసులరెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ లక్ష్మీనారాయణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉయ్యాలవాడకు నివాళులర్పించిన తులసిరెడ్డి

వేంపల్లె, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 176వ వర్ధంతి సందర్బంగా బుధవారం వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్బంగా తులసి రెడ్డి మాట్లాడుతూ 1857లో జరిగిన ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామానికి పదేళ్ల ముందే ఆంగ్లేయుల దుష్టపాలనపై తిరుగుబాటు చేసి వీరమరణం పొందిన ప్రథమ భారత స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని కొనియాడారు. నరసింహారెడ్డి పోరాటపటిమ, వీరత్వం, ప్రతి తెలుగువాడికి, భారతీయుడికి స్పూర్తి_దాయకం అన్నారు. ఆయన పోరాట స్పూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దుష్టపాలనపై పోరాటం సాగించాలని కాంగ్రెస్ శ్రేణులకు, ప్రజలకు తులసిరెడ్డి పిలుపునిచ్చారు. అలాగే ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు స్వర్గీయ మౌలానా అబుల్‌కలాం ఆజాద్ అసలైన జాతీయవాది అని తులసిరెడ్డి శ్లాఘించారు. అబుల్‌కలాం ఆజాద్ 65వ వర్ధంతిని వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.

## అబ్దుల్ కలాం ఆజాద్ సేవలు మరువలేనివి

రాయచోటి అర్బన్ .ఫిబ్రవరి22 ప్రభాతవార్త



స్వాతంత్ర్య సమరయోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖా మంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ రాయచోటి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎస్.అల్లాబకస్ అన్నారు. మంగళవారం ఆయన పార్టీ కార్యాలయంలో ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి వర్ధంతి వేడుకలను ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ అబ్దుల్ కలాం ఆజాద్ అసలు పేరు మోహిద్దీన్ అహ్మద్ అయితే అబ్దుల్ కలాం అనేది బిరుదు ఆయనకు వచ్చిందన్నారు. మన దేశంలో విద్య అభివృద్ధికి బాటలు వేసిన తొలి బాటసారి అబ్దుల్ కలాం ఆజాద్ అని ఆయన కొనియాడారు. 1947 ఆగస్టు 15 నుంచి అంటే స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 1958 ఫిబ్రవరి 2 వరకు కేంద్ర విద్యాశాఖ మంత్రిగా సేవలందించారని చెప్పారు. ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం భారతరత్న అవార్డు ఇచ్చిందన్నారు. 2008లో భారత ప్రభుత్వం ఆయన పుట్టిన రోజును జాతీయ విద్యా దినోత్సవంగా నిర్ణయించిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిసిసి డెలిగేట్ ఎస్ఎండి గౌస్, పిసిసి మెంబర్ ఖదీర్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు చెన్నకృష్ణ, పట్టణ అధ్యక్షుడు హబీబ్, తదితరులు పాల్గొన్నారు.

## యువత విద్యతో పాటు క్రీడలలో రాణించాలి

-ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి .ఫిబ్రవరి22 ప్రభాతవార్త



క్రీడలకు వైసిపి ప్రభుత్వం ప్రత్యేక ప్రాముఖ్యతను కల్పించిందని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రాయచోటి పట్టణంలోని ఈద్గా ప్రాంగణంలో బుధవారం అబుసిద్దిక్ ట్రావెల్స్ స్పాన్సర్‌షిప్ తో వైకాపా మైనార్టీ నాయకులు బేపారి మహమ్మద్ ఖాన్ ఆద్వర్యంలో నిర్వహించిన క్రికెట్ క్రీడా పోటీలను స్థానిక మున్సిపల్ చైర్మన్ షేక్ ఫయాజ్ బాష, వైస్ చైర్మన్ ఫయాజురెహ్మాన్, మాజీ ఎంపిపి పోలు సుబ్బారెడ్డి, మండల బిసి నాయకులు పల్లపు రమేష్‌లతో పాటు బేపారి మహమ్మద్‌ఖాన్‌తో కలిసి శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. వీరికి స్థానిక వైకాపా నాయకులు, యువత ఘన స్వాగతం పలికారు. అనంతరం క్రీడా మైదానంలో క్రీడాకారులతో ముచ్చటించారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాష బంతిని వేయగా ఎమ్మెల్యే బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. ఎమ్మెల్యే టాస్ వేసి క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్బంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ యువతలో క్రీడా నైపుణ్యాన్ని నింపేందుకు అబుసిద్దిక్ ట్రావెల్స్ వారి సహకారంతో ఈ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడలలో ఓటమి గెలుపులు సహజమేనని, ప్రతి క్రీడాకారుడులో క్రీడా స్పూర్తి కలిగి ఉండాలన్నారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.50వేలు, రెండవ బహుమతిగా రూ.30 వేలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఎమ్మెల్సీ నామినేషన్‌కు భారీగా తరలిన రాయచోటి ఉపాధ్యాయులు

-మడితాటి నరసింహారెడ్డి

రాయచోటి టౌన్ .ఫిబ్రవరి22 ప్రభాతవార్త



అనంతపురంలో పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎం.వి.రామచంద్రారెడ్డి నామినేషన్ కార్యక్రమానికి బుధవారం ఉదయం రాయచోటి ఉపాధ్యాయులు భారీగా తరలివెళ్లారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో ఆయనకు మద్దతు నిచ్చే 36 ఉపాధ్యాయ, అద్యాపకులు ప్రతినిధులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్బంగా పిఆర్‌టియు రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ కొండూరు శ్రీనివాస రాజు మాట్లాడుతూ అటు ప్రభుత్వాన్ని, ఇటు ఉపాధ్యాయ వర్గానికి వారధిగా ఓర్పు, నేర్పు, సహనంతో అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయ, అద్యాపకులు సమస్యలను పరిష్కరించే ఏకైక వ్యక్తి రామచంద్రారెడ్డి అన్నారు. కావునా ఆయనను ప్రథమ ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని కోరారు. ప్రభుత్వంతో మంచి సంబందాలు కలిగి ఉపాధ్యాయులుకు ఉన్న అన్ని సమస్యలను రామచంద్రారెడ్డి ద్వారా పరిష్కారం అవుతాయన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ శిధిలా స్థితిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను కార్పోరేట్ పాఠశాలలుగా మార్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. వివిధ వినూత్న కార్యక్రమాలు అమలు చేయడం వల్ల ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులకు కూడా గౌరవం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కల్పలత, మిట్ట క్రిష్ణయ్య, కరుణానిధి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## తొలి తెలుగు విప్లవవీరుడు ఉయ్యాలవాడకు ఘన నివాళి

సంబేపల్లి .ఫిబ్రవరి22 ప్రభాతవార్త



సంబేపల్లి మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉదయం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు రెడ్డెయ్యరెడ్డి మాట్లాడుతూ బ్రిటీష్ వారిని ఎదిరించి తొలి తెలుగు విప్లవ వీరుడు ఉయ్యాలవాడ అని కొనియాడారు. తొలి స్వాతంత్ర్య ఉద్యమానికి 100 సంవత్సరాలు ముందే దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ వారిని ఎదిరించి వారికి ముచ్చెమటలు పట్టించాడన్నారు. ఈయనను 1847 ఫిబ్రవరి 22వ తేదీన బ్రిటీష్ ప్రభుత్వం ఉరి తీసిందన్నారు. గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడైన ఉయ్యాలవాడ వర్ధంతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించమని సూచించిందన్నారు. సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయులు శంకరయ్య ఉయ్యాలవాడ నరసింహారెడ్డిని వీరోచిత స్వాతంత్ర్య పోరాటాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, ఉపాధ్యాయులు రామయ్య, విజయసారధిరెడ్డి, జయరాంనాయక్, వెంకట్రాజు, సురేందర్ రాజు, నబీసాహెబ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించిన మాజీ జస్టీస్

వీరబల్లి .ఫిబ్రవరి22 ప్రభాతవార్త



వీరబల్లి మండలం గడికోటలో కొత్తగా పునరుద్దరణ చేయబడ్డ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఉమ్మడి హైకోర్టు మాజీ న్యాయమూర్తి మరియు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ సివి నాగార్జునరెడ్డి, రాజంపేట నియోజకవర్గ వైసిపి నేత గాలివీటి విజయసాగర్‌రెడ్డి, వీరబల్లి మండలాధ్యక్షులు గాలివీటి రాజేంద్రనాద్‌రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వమని రైతు ప్రశాంతంగా ఏ దిగులూ లేకుండా పంట పండించుకోవడానికి కావాలసిన అన్ని సౌకర్యాలను కల్పిస్తుందని, రైతులకు నిరంతర ఉచిత విద్యుత్, పంట పెట్టుబడిగా ఏడాదికి పదమూడు వేలు, సబ్సిడి విత్తనాలు, సబ్సిడిపై రైతులు పనిముట్లు ట్రాక్టర్‌లను ఇస్తోందన్నారు. వ్యవసాయం దండగ అనే నీరుగార్చే వారి పాలన నుంచి వ్యవసాయం పండగ అనే ఆశావాహ దృక్పథం లోకి రైతులను తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు రైతులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి

ఎఎస్ఐ శంకర్‌నాయక్

నందలూరు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త

నందలూరు మండలంలోని బస్టాండ్ కూడలిలో ఎఎస్ఐ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా ఎఎస్ఐ శంకర్‌నాయక్ మాట్లాడుతూ పైస్థాయి అధికారుల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. మండలంలోని బస్టాండు కూడలిలో నియమ నిబంధనలు పాటించని ఆటో డ్రైవర్లపై కఠినచర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలు, లైసెన్సు, ఇన్సురెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆటోలో ప్రయాణికులు పరిమితికి మించి ఉంటే వారిపై చర్యలు తీసుకోవడంలో వెనకాడబోమని ఈ సందర్బంగా ఆటో డ్రైవర్లకు సూచనలు జారీ చేశారు. బస్సులు వచ్చే సమయంలో ఆటోలు క్రమ పద్ధతిలో వెళ్లాలని, ఇష్ట ప్రకారం ఆటోలను ఎక్కడపడితే అక్కడ నిలిపితే సీజ్ చేసి కోర్టుకు పంపడం జరుగుతుందన్నారు. ఆటోడ్రైవర్లు, వాహనదారులు ఆర్‌టిఐ రూల్స్‌ను తప్పక పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ దర్బార్‌బాషా, ఆటో డ్రైవర్లు, వాహనదారులు, ప్రజలు పాల్గొన్నారు.

## గంగమ్మ జాతర హుండీ ఆదాయం రూ.16.81లక్షలు

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:



ఈనెల 21, 22 తేదీల్లో జరిగిన గంగమ్మ జాతరలో భాగంగా బుధవారం హుండీ లెక్కించగా ఆదాయం రూ.16.81లక్షలు వచ్చినట్లు ఈవో రవీంద్రరాజు, చైర్మన్ నరసింహారెడ్డి తెలిపారు. ఈ సందర్బంగా జాతర సంబంధిత రూ.10 టికెట్లకు సంబంధించి రూ.1,39,240, రూ.100 టికెట్లకు సంబంధించి రూ.3,67,100 వచ్చిందన్నారు. మొత్తం టికెట్లకు సంబంధించిన రూ.56,340 వచ్చింది. జాతరకు సంబంధించిన హుండీ ఆదాయం రూ.11,75,374 రాగా అన్నీ కలుపుకొని రూ.16,18,714 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. ఈ సందర్బంగా గతేడాదికన్నా ఈ ఏడాది రూ.లక్ష పైగా ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ మరియు సిబ్బంది తెలిపారు.

## రూ.10 లక్షలు వ్యయంతో డ్రైనేజీ పనులు ప్రారంభం

బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :



మున్సిపాలిటీలోని 17వ వార్డు శ్రీకృష్ణ దేవరాయ నగర్‌లో బుధవారం కౌన్సిలర్ దుద్దుకూరు సత్యనారాయణ 14వ ఆర్థిక సంఘం క్రింద రూ.10 లక్షలు ప్రత్యేక నిధులతో డ్రైనేజీ కాలువ పనులను ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలోని శ్రీకృష్ణ దేవరాయ నగర్‌లో వార్డు ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు వార్డులోని అన్ని వీధులలో సుమారు 2కోట్ల రూపాయలు వ్యయంతో సీసీ రోడ్లు పూర్తి చేయడంతో పాటు, డ్రైనేజీ సమస్య ఉన్న ప్రాంతాలలో 10 లక్షల రూపాయలు వ్యయంతో డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులను కూడా పూర్తి చేసేందుకు బుధవారం జేసీబీ ద్వారా పనులను ప్రారంభించారు. త్వరలోనే నాణ్యతగా డ్రైనేజీ పనులను కూడా పూర్తి చేసి వార్డులో ఎక్కడ ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని రకాల వసతులు కల్పించే విధంగా 17వ వార్డులో ఏర్పాటు చేస్తామన్నారు.

## పరిహారం పంపిణీ వేగవంతం చేయండి

-అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్

రాయచోటి .ఫిబ్రవరి22 ప్రభాతవార్త



ఎన్‌హెచ్-71 మదనప ల్లి పీలేరు రహదారికి భూము లు కోల్పోయిన వారికి నష్టప రిహారం పంపిణీ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీ షా పిఎస్ బుధవారం నేషనల్ హైవే అధికారులు, విఆర్‌వోలను ఆదేశించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ పీలేరు, మదనపల్లి నాలుగులైన్‌ల జాతీయ రహదారి పూర్తి అయితే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కావునా పెండింగ్ భూసేకరణ వేగవంతం చేయాల ని అధికారులను ఆదేశించారు. వేపులబైలు, బోదుమల్లువారిపల్లి, గూడెవుపల్లి, తదితర గ్రామాల విఆర్‌వోలతో కలెక్టర్ సుదీర్ఘంగా సమీక్షించి వీలైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేసి నేషన్ హైవే అధికారులకు అప్పజెప్పాలన్నారు. అందులో ప్రభుత్వ భూమి, డికేటి భూమి, పట్టాభూమి ఎన్ని ఎకరాలు, ఇంకా ఎన్ని ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయి వంటి వివరాలను అడిగి తెలుసుకుని త్వరగా క్లియర్ చేయాలన్నారు. జాతీయ రహదారి వెళ్లే దారిలో లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణం జరిగా యని, వారికి నష్ట పరిహారం చెల్లింపు కోసం ఎంత ఖర్చు చేశారో అంత ఎస్టీమే షన్ తయారు చేయాలని హౌసింగ్ డీఈని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రవి, ఎన్‌హెచ్‌డిప్యూటి తహశీల్దార్ గురుప్రసాద్, విఆర్‌వోలు పాల్గొన్నారు.

## బాలరాజమ్మ మృతి అత్యంత బాధాకరం

ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త



రైల్వేకోడూరు మండ లంలోని అనంతరాజుపేట పంచాయతి ఇందిరానగర్‌కు చెందిన దక్కిలి బాలరాజమ్మ ఆకస్మికంగా మృతిచెందడం అత్యంత బాధాకరమైన విష యమని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన బాలరాజమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్బంగా విఒఎ అమ్మగారైన కమలమ్మ తల్లి బాలరాజమ్మ అందరిపట్ల ఎంతో గౌరవంగా ఉండేదని చక్కటి మృదుస్వభావిగా చక్కటి మన్ననలను పొందిందని ఆమె ఆకస్మికంగా మృతి చెందడం బాధాకరమైన విషయమన్నారు. అదేవిధంగా ఆమె కుటుంబా న్ని అన్నివిధాల ఆదుకొంటామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా రైతుసలహామండలి ఛైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, సుధాకర్‌రాజు, దక్కిలి సుబ్రమణ్యం, వెలుగుకు చెందిన పొదుపు మహిళలు పాల్గొన్నారు. అనంతరం బాలరాజమ్మ మృతదేహానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు.

## పురుగు మందుల దుకాణాలు తనిఖీ

దువ్వూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:



మండల కేంద్రమైన దు వ్వూరులో బుధవారం మం డల వ్యవసాయాధికారి అమ ర్‌నాథ్‌రెడ్డి వివిధ పురుగు మందుల దుకాణాలు తనిఖీ చేశారు. వివిధ కంపెనీల మందులు శాంపిల్స్ తీసి వాటి నాణ్యతకు గాను ల్యాబ్ కు పంపడం జరుగుతోం దన్నారు. మందులు విక్రయించే సమయంలో రైతులకు రసీదులు ఇవ్వాలని అందులో లార్ట్, బ్యాచ్ నెంబరు కూడా నమోదు చేయాలన్నారు. ఆ మందు వాడకం వల్ల ఏదైనా నష్టం జరిగితే అవి చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం యూరియా కొరత కొద్ది మేర ఉందని దానికి అనుగుణంగా బుధవారం దువ్వూరు, ఎర్రబల్లె రైతు భరోసా కేంద్రాలకు సుమారు 40 టన్నులు యూరియా పంపిస్తున్నామన్నారు. మన గ్రోమోర్‌లో యూరియా నిల్వ ఉందని రైతులు కొనుగోలు చేయవచ్చన్నారు. రైతులకు అవసరమైన రసాయన ఎరువులు లభించని సమయంలో వ్యవసాయ అధికారులను, ఆర్‌బీకేలలో సంప్రదించాలన్నారు. పెద్దజొన్నవరం గ్రామంలో శనగలు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశామని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## వైభవంగా ప్రారంభమైన మారమ్మతల్లి విగ్రహప్రతిష్ఠ ఉత్సవాలు

చిట్వేలి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త



భక్తుల కొంగు భంగారంగా విరాజిల్లుతున్న శ్రీశ్రీశ్రీ మారమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు చౌడవరం వెంకటనరసారెడ్డి, సురేంద్రరెడ్డిలు గ్రామ పెద్దలతో కలిసి మొదటగా గ్రామదేవత గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక శివాలయం వద్ద నుండి నిర్వాహకులు అమ్మవారిని పసుపు, కుంకుమ, వస్త్రాలతో మేళతాళాల మధ్య పోతులరాజులతో ఊరేగింపుగా అమ్మవారి విగ్రహాన్ని గ్రామోత్సవంగా తరలించారు. సాయంత్రం అగ్నిప్రతిష్ఠ, దీక్షాహోమం, అర్చన, మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాదం తదితర ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు మహోత్సవ కార్యక్రమంలో అమ్మవారిని శరణు కోరారు. కార్యక్రమంలో అర్చకులు సతీష్‌శర్మ, అరవింద్‌శర్మ, పవన్‌శర్మ, నాని, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గృహసారథులు, సచివాలయ కన్వీనర్‌లు సైనికుల్లా పనిచేయాలి

-ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లి .ఫిబ్రవరి22 ప్రభాతవార్త



గృహసారథులు, సచివాలయ కన్వీనర్‌లు సైనికుల్లా పనిచేయాలని రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. దేశం గర్వపడే విధంగా ప్రజా సంక్షేమ పాలన సాగుతోందని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను ప్రజల చెంతకు తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న అనే నినాదంతో ముందుకు సాగుతూ అభివృద్ధి పలాలు అందుకుంటున్న లబ్దిదారులకు జగనన్న ఆశయాలను పార్టీ సిద్ధాంతాలను వివరించాలన్నారు. గత ప్రభుత ంలో చంద్రబాబు నాయుడు ఏమి చేశాడో, ఇప్పటి మన జగనన్న ప్రభుత్వం ఏమి మేలు చేస్తున్నామో ప్రతి కుటుంబానికి వివరించాలన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో 108, 104, ఆరోగ్యశ్రీ, ఫీజురియంబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్ వంటి పథకాలు అందాయని, జగన్ పాలనలో అమ్మఒడి, విద్యా దీవెన, నాడు నేడు ద్వారా పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులు అభివృద్ధి, జగనన్న కాలనీలు, గ్రామ సచివాలయంలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు నిర్మాణాలతో గ్రామాల రూపురేకలు మారుతున్నాయన్నారు. జగన్ పాలనలో అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాలు అందడం జరిగిందన్నారు. కులాలు మతాలు పార్టీలు, వర్గాలు చూడడం లేదన్నారు. ఎంతో వెనుకబడిన రాయచోటిని జిల్లా కేంద్రం చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కలెక్టర్, ఎస్‌పి తదితర 98 శాఖల జిల్లా అధికారులు అందుబాటులో ఉన్నారరన్నారు. నిజాయితీలుతో అభివృద్ధే ధ్యేయంగా పనిచేసి నియోజకవర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నామనా న్నారు. 2024 లో వైఎస్సార్‌సిపి గెలుపే లక్ష్యంగా శక్తివంచనలేకుండా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపిపి ఆవుల నాగశ్రీలక్ష్మీ, సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షుడు చిదంబర్‌రెడ్డి, మాజీజెడ్‌పిటిసి గొర్లఉపేంద్రరెడ్డి, వైఎస్సార్‌సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మతి

వాల్మీకిపురం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్తః



మండలంలోని చింతపర్తి సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మతిచెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలు వాల్మీకిపురం మండలం జర్రావారిపల్లె వడ్డిపల్లెకు చెందిన బండి రమణయ్య(58) 20 ఏళ్ల క్రితం సోమల మండలం కందూరు పంచాయతీ ఉలవలకుంటకు వలస వెళ్లి నివాసం ఉంటున్నాడు. ఇటీవల సొంత పనుల నిమిత్తం స్వగ్రామమైన వడ్డిపల్లెకు వచ్చి మంగళవారం రాత్రి సొంత ఊరికి బయలుదేరాడు. ఈమధ్యలో ఏమిజరిగిందో తెలియదు కానీ మార్గమధ్యంలోని చింతపర్తి వద్ద రమణయ్య బుధవారం ఉదయం శవమై కనిపించాడు. ఏదైనా వాహనం ఢీకొని మతిచెందాడా, లేక ఎవరైనా దాడిచేసి చంపారా అన్న కోణంలో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. . శవ పరీక్ష నిమిత్తం మతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మతుడుకుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై బిందుమాధవి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు మండల తెదేపా సమావేశం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్తః

మండలంలోని చింతపర్తి ఆర్యవైశ్య కళ్యాణమండపంలో నేడు గురువారం మధ్యాహ్నం 3గంటలకు తెదేపా జాతీయ కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన వాల్మీకిపురం మండలం తెదేపా సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల తెదేపా అధ్యక్షులు గుర్రం మల్లికార్జునరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి మొదటివారంలో పీలేరు నియోజకవర్గంలో తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర కొనసాగిస్తున్న దష్ట్యా ఈసమావేశంలో పాదయాత్ర విజయవంతం పై చర్చించడం జరుగుతుందన్నారు. ఈవిషయాలను దష్టిలో ఉంచుకుని మండలంలోని తెదేపా నాయకులు నందమూరి అభిమానులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## నాయీ బ్రాహ్మణులకు ఎమ్మెల్సీ వాగ్దానం ఏమైంది

– జిల్లా అధ్యక్షుడు గూడూరు రామచంద్ర

వేంపల్లె, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :



ఏపీలో వైకాపా ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయీ బ్రాహ్మణులకు రాజ్యాంగ పరమైన పదవులు ఇవ్వకుండా అణగదొక్కే ప్రయత్నం చేశారని జిల్లా నాయీబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు గూడూరు రామచంద్ర ఒక పత్రికా ప్రకటనలో వ్యతిరేకించారు. బీసీలకు సామాజిక న్యాయమని చెప్పుకుంటూ కొన్ని కులాలకు ప్రాధాన్యత ఇచ్చి నిరంతరం సమాజానికి ఉపయోగపడే మాజాతికి రాజకీయ ప్రాధాన్యత ఇవ్వకుండా చేయడం దురదృష్టకరమని ఆయన తెలిపారు. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో తాము అధికారంలోకి వస్తే నాయీబ్రాహ్మణులకు రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తామని రాజ్యాంగపరమైన పదవిని కల్పిస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన తరువాత గాలికి వదిలేసి మాట తప్పారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్ ఐదేళ్ల పాలనలో నాయీబ్రాహ్మణులకు ఎటువంటి పార్టీ పదవి కానీ, రాజకీయ ప్రాధాన్యత కానీ నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించకుండా మా జాతిని అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని, పరిస్థితి ఇలాగే కొనసాగితే రాజ్యాధికారానికి దూరమై కులాలన్నింటినీ ఏకం చేసి ఉద్యమిస్తామని ప్రభుత్వానికి ఆయన హెచ్చరించారు.